
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్
శనివారం 6 జనవరి 2018 | 20





కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సయ్యద్ ఒమర్ జలీల్

అభివృద్ధే ప్రధాన లక్ష్యం

- సంక్షేమానికి అధిక ప్రాధాన్యం
- వెనకబడిన జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తాం
- వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు కృషి
- 'హరితహారం'లో జిల్లా ముందుండేలా ప్రయత్నం
- పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు
- ప్రభుత్వ పథకాల అమలుపై కార్యాచరణ
- కలెక్టర్ సయ్యద్ ఒమర్ జలీల్

వివరాలు 7లో

నేడు ముత్యాల ముగ్గుల పోటీలు

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో తాండూరులో రంగవల్లులు



ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఆధ్వర్యంలో శనివారం తాండూరు పట్టణంలో ముత్యాల ముగ్గుల పోటీ నిర్వహిస్తున్నారు. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్,టాటా జెమినీ టీ ముత్యాల ముగ్గులపోటీలు.. టేస్ట్ పార్టనర్ గోల్డ్ డ్రాప్, ప్యాషన్ పార్టనర్ డిగ్‌సేల్, హెల్త్ పార్టనర్ అమృతబిందు ఆధ్వర్యంలో జరిగే ఈ ముత్యాల ముగ్గుల పోటీలు ఉదయం 9.30 గంటల నుంచి ప్రారంభమవుతాయి. పట్టణంలోని గంగోత్రి విద్యాలయం ఆవరణలో జరగనున్నాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ బహుమతి కింద రూ.ఐదువేలు, ద్వితీయ బహుమతిగా రూ. మూడు వేలు, తృతీయ బహుమతి కింద రూ. రెండు వేల రూపాయల నగదు బహుమతులు అందజేయనున్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మిగతా 7లో..



7 లో

ఇసుకాసురులు

- ఆగని ఇసుక దందా!..
- ఒక బిల్లు.. అనేక ట్రిప్పులు
- వేబిల్లు ఇసుక పేరుతో కృత్రిమ ఇసుక దందా!
- వ్యాపారుల సిండికేట్..
- అధికారులకు మామూళ్లు?
- టన్ను ఇసుక రూ.1400 నుంచి రూ.2000

పర్మిట్ల ముసుగులో ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఈ దందాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులకు ఆశించిన ముడుపులు అందుతుండడంతో వ్యాపారం మూడుపువ్వులు.. ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. ఒకే బిల్లుపై లెక్కలేనన్ని ట్రిప్పులు అమ్ముతూ వ్యాపారులు రూ.లక్షలు గడిస్తున్నారు. పర్మిట్ ఇసుక పేరుతో పరిగి కేంద్రంగా కృత్రిమ ఇసుక దందాకు కొందరు వ్యాపారులు తెరలేపారు.

- శ్మశానవాటికల నిర్మాణంపై అంతులేని అలసత్వం
- అడుగు ముందుకు పడని పనులు
- ఉమ్మడి జిల్లాలో 576 నిర్మాణాల లక్ష్యం
- నిధులు మంజూరైంది 280కే..
- పూర్తయింది ఒక్కటే..
- పురోగతిలో ఉన్నవి 35 మాత్రమే



నిధులున్నా.. నిర్లక్ష్యమే!

పుట్టిన ప్రతి మనిషీ గిట్టక తప్పదు.. ఇది ప్రకృతి ధర్మం.. చనిపోయాక అంత్యక్రియలు నిర్వహించేందుకు ఆరడుగుల స్థలం కోసం నానా అవస్థలు పడక తప్పడం లేదు. ఉమ్మడి జిల్లాలో అనేక గ్రామాల్లో కొన్ని వర్గాల వారికి శ్మశానవాటికలు లేవు. చనిపోయిన వారిని ఖననం చేసేందుకు స్థలాలు కరువయ్యాయి. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో శ్మశాన వాటికలు లేని కారణంగా పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఉన్న శ్మశాన వాటికల్లో సౌకర్యాలూ అంతంతే..

8 లో

ఆంధ్రజ్యోతి / ఇంటర్వ్యూ

ఉపాధి హామీతో గ్రామాల్లో మౌలిక వసతులు

- ఈ పథకం కింద పలు పనులు చేపట్టాలని జిల్లా యంత్రాంగం నిర్ణయం
- మేడ్చల్ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కౌటిల్య



కీసర రూరల్ : ఉపాధి హామీ పనులతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా గ్రామాల్లో చేపట్టాల్సిన పనులు గుర్తించి బడ్జెట్‌ను రూపొందిస్తోంది. ఈమేరకు డీఆర్‌డీవో అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని గ్రామీణ మండలాల్లో ఈ పథకం కింద కేవలం మరుగుదొడ్ల నిర్మాణం, హరితహారం, ఇంకుడు గుంతల తవ్వకం వంటి పనులను చేపట్టేవారు. జిల్లాల పునర్విభజనలోనూ మేడ్చల్ జిల్లా గ్రామీణ ప్రాంతంతో పాటు సెమీఅర్బన్, అర్బన్ ప్రాంతాలను కలుపుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో ఈ పథకం కింద పలు పనులు చేపట్టాలని జిల్లా యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. జిల్లాలో చేపడుతున్న పనులపై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఈ పథకం కింద కూలీలకు 100 రోజుల పనిదినాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో మొత్తం 77 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో కీసర మండలంలో 12 గ్రామ పంచాయతీలు, శామీర్‌పేట్‌లో మండలంలో 24, మేడ్చల్‌లో 16, ఘట్‌కేసర్‌లో 21 కుత్బుల్లాపూర్ మండలంలో 6, బాచుపల్లిలో 2, దుండిగల్ గండి మైసమ్మలో 4 వరకు గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2018-19 సంవత్సరంలో 4,41,400 పనిదినాలు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. జిల్లాలో మొత్తం 2,982 శ్రమశక్తి సంఘాలు ఉండగా, ఈ సంఘాల్లో 4,414 మంది కూలీలు ఉన్నారు. నెలవారీగా ఎంతమందికి ఉపాధి కల్పించాలన్న దానిపై ప్రణాళికను రూపొందిస్తున్నాం. జిల్లాలో భూగర్భ జలాల పెంపుకు సమగ్ర వాటర్‌షెడ్ పనులు చేపడుతున్నాం.

గ్రామాల్లో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేసి ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతుల బంజరు భూముల అభివృద్ధి పనులు చేస్తున్నాం. కొత్తగా పంట కాల్వలను తీయటం, ఫీడర్ కాల్వల్లో, పంట కాల్వల్లో పూడిక తీయుట వంటి పనులు చేపట్టనున్నారు. పశువులకు నీటి తొట్లు, తాగునీటి పైపులైన్లు, మినీవాటర్ ట్యాంకులు, ఆర్వోప్లాంట్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సహజ వనరుల కింద నీటి నిల్వ కందకాలు, మట్టికట్టలు, విడి రాళ్ల కట్టుట, ఫారంపాండ్లు, ఊటకుంటలు, చెక్‌డ్యాంలు, పశువుల పాకల నిర్మాణం, కోళ్లఫారాలు, ఫిట్‌లను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఉత్పాదక పెంపు కింద వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యానవన, మత్స్యశాఖ తదితర సంఘాలకు కొంత రుణాన్ని కూడా అందజేస్తున్నాం. చేపల ఉత్పత్తి కుంటల నిర్మాణం, మైనర్ ఇరిగేషన్ కాలువల్లో పూడికతీత, మంచినీటి చెరువులు, పూడికతీత పనులు చేపడుతున్నాం



హరితహారంలో మొక్క నాటుతున్న యువకులు (ఫైల్)

సమాజ హితమే లక్ష్యం.. సేవే మార్గం..

యూత్

- సమష్టి కృషితో ముందుకు సాగుతున్న యువకులు..
- సేవా కార్యక్రమాలతో ఆదర్శం
- ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న నవ సమాజ్ నిర్మాణ్ అసోసియేషన్ యువజన సంఘం

మంచాల : సమాజ హితమే లక్ష్యంగా ఆ యువకులు సమష్టి కృషితో ముందుకు సాగుతున్నారు. సేవా కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న ఎల్లమ్మతండా నవసమాజ్ నిర్మాణ్ అసోసియేషన్‌పై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.. రంగారెడ్డి జిల్లా మంచాల మండల పరిధిలోని ఎల్లమ్మతండాకు చెందిన యువకులు యువజన సంఘంగా ఏర్పడి 2012 సంవత్సరంలో నవసమాజ్ నిర్మాణ్ అసోసియేషన్ పేరిట నామకరణం చేసుకున్నారు. మొదట్లో ఆటపాటలకే పరిమితమైన ఈ సంఘం సమాజం కోసం ఏదైనా చేసి ప్రత్యేకతను చాటాలనుకున్నారు. యువజన సంఘంలో అంతా చదువుకున్న యువకులే కావడంతో గ్రామంలో మొదటగా లైబ్రరీ ఏర్పాటు చేయించి దినపత్రికలు, కాంపిటీషన్ పుస్తకాలను అందుబాటులోకి తెచ్చుకున్నారు. అ తర్వాత గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచారు. ఇంతటితోనే వీరి ప్రయాణం ఆపకుండా గ్రామంలో నెలకొన్న సమస్యలపై దృష్టిపెట్టారు. ఈ క్రమంలోనే గ్రామంలో ఏ సమస్య ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులను కలుస్తూ పరిష్కారానికి చొరవ చూపారు. గాడివంపువాగు ప్రాజెక్టు కోసం ఉద్యమం, అవినీతిపై పోరాటం, అక్రమ ఇసుక తరలింపుపై ఉద్యమం, రాష్ట్రవ్యాపిత సంచలనంగా గుర్తింపు పొందిన ప్రేమికుడి కోసం యువతి మౌనదీక్షకు మద్దతు పలకడం గుర్తింపును తీసుకువచ్చాయి. వీరు చేస్తున్న సేవలకుగాను సంఘం సభ్యులకు పలుమార్లు అవార్డులు తీసుకువచ్చాయి. అంతేగాక వీరి సేవానిరతికి సర్వత్రా ప్రశంసలు లభించాయి.

గాడివంపు వాగు ప్రాజెక్టు కోసం నిరాహార దీక్ష

ఎల్లమ్మతండా సమీపంలో గాడివంపువాగు ప్రాజెక్టు నిర్మాణం కోసం సమైక్య రాష్ట్రంలో ఇద్దరు మంత్రులు శిలాఫలకాలు ఆవిష్కరించినా ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే పరీవాహక గిరిజన గ్రామాలన్నింటికీ సాగునీటిని అందించే పరిస్థితి ఏర్పడుతుంది. పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యపై నవసమాజ్ నిర్మాణ్ అసోసియేషన్ ఉద్యమించి స్థానిక తహసీల్దారు, ప్రజాప్రతినిధులు మొదలుకొని కలెక్టర్ దాకా వినతిపత్రాలు సమర్పించి సమస్య తీవ్రతను వివరించారు. అంతేగాక ప్రాజెక్టు నిర్మాణం కోసం నిరాహార దీక్షలు సైతం చేశారు. వీరి ఆందోళనకు తోడు టీడీపీ, సీపీఎంలకు చెందిన నేతలు, స్థానిక ఎమ్మెల్యే చొరవతో ఈ ప్రాజెక్టు నిర్మాణం అంశంపై కదలిక వచ్చింది.



శ్రమదానం చేస్తున్న యువకులు (ఫైల్)

యువతి మౌనదీక్షకు బాసట..

ఎల్లమ్మతండాలో ప్రేమించిన ప్రియుడి కోసం సుజాత మౌనదీక్ష అప్పట్లో రాష్ట్రవ్యాపిత సంచలనంగా మారింది. ప్రియుడి ఇంటి ముందు ఏడాది పాటు వంటావార్పు చేసుకుని ఆందోళన చేసింది విదితమే. సుజాత న్యాయపోరాటానికి నవసమాజ్ నిర్మాణ్‌కు చెందినయువకులు చివరిదాకా బాసటగా నిలిచి పోరాడారు.

అవినీతి, ఇసుక మాఫియాపై పోరాటం

అధికార యంత్రాంగంలో పేరుకుపోయిన అవినీతి, ఇసుకమాఫియాపై యువజన సంఘం సభ్యులు చేసిన పోరాటం గుర్తింపు తీసుకువచ్చాయని చెప్పవచ్చు. 2015లో వ్యవసాయ శాఖ అధికారిని అవినీతిశాఖకు పట్టించింది నవసమాజ్ నిర్మాణ్ అసోసియేషన్‌కు చెందిన వ్యవస్థాపక అధ్యక్షుడు సపావట్ దేవ్‌రాం. ఇంకా గ్రామ సమీపంలోని కండరాయి చెరువుకు వచ్చే వాగులో ఇసుక అక్రమ తరలింపును అడ్డుకోవడంలో యువజన సంఘం సభ్యులు నిరంతరంగా శ్రమిస్తున్నారు. ఎప్పటికప్పుడు రెవెన్యూ అధికారులు, పోలీసులకు సమాచారం ఇస్తూ సహకరిస్తున్నారు. చేపట్టాల్సిన పనులపై పూర్తిస్థాయి నివేదికను రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.



సంఘ సేవలోనే తృప్తి..

ఎంటెక్ పూర్తిచేసి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాను. జనం కోసం ఏదైనా చేయాలని ముందు నుంచి అనిపించేది. మొదట్లో శ్రమదానం, క్రీడా పోటీలు నిర్వహించేవారం. ఇంకా ఏదైనా చేయాలనిపించింది. అప్పటి నుంచి ప్రజాసమస్యలపై గళమెత్తుతున్నాం. సమాజ సేవలోనే తృప్తి కలుగుతోంది. ప్రజాసమస్యలపై పోరాటంలో అందరూ కలిసి పనిచేయాలని యువజన సంఘంగా ఏర్పడ్డాం.

-సపావట్ దేవ్‌రాం, వ్యవస్థాపక అధ్యక్షుడు



సెలవు దినాల్లో స్నేహితులకు తోడుంటా..

ఊరికోసం సేవ చేయాలంటే ఇష్టం. విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవాణ్ణి. ఇప్పుడు ఉద్యోగం వచ్చింది. అయినా ధ్యాస అంతా ఊరిమీదే. అందుకే సెలవుదినాల్లో తోటి స్నేహితులతో కలిసి సమాజసేవలో పాల్గొంటున్నాను.

-దేవేందర్, పోలీస్ కానిస్టేబుల్

భక్తి

భక్తుల కొంగుబంగారం... పరిగి వెంకన్న



పరిగి: వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలసిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలోని వెంకన్న భక్తులు కోరిన కోర్కెలు తీర్చే వెంకన్నగా ప్రసిద్ధి చెందారు. విశాలమైన ప్రదేశంలో నిర్మించిన దేవాలయం 30 ఏళ్ళు పూర్తి చేసుకుంది. ప్రతి ఏడాది స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. గత ఏడాది కోటి రూపాయల వ్యయం తో దేవాలయ నిర్మాణాన్ని పునరుద్ధరించారు. అలాగే ప్రాంగణంలో వినాయకుడు, ఆంజనేయస్వామి, నాగుల ఆలయాలను కూడా నిర్మించారు. లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో విశాలమైన ప్రదేశంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారు కల్యాణ మండపాన్ని నిర్మించారు. ఈ కల్యాణ మండపాన్ని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఆశ్రయంగా ఉపయోగించుకుంటారు. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే వెంకన్నగా పేరుగాంచిన ఈ దేవాలయానికి వేలాదిమంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ దేవాలయం పునరుద్ధరణ తర్వాత నిత్యపూజలకు భక్తుల సంఖ్య బాగా పెరిగింది.

ఉద్యోగవర్గం

రేషన్ డీలర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- వికారాబాద్ జిల్లా రేషన్ డీలర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి



పరిగి: రేషన్ డీలర్లకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రస్తుతం కొనసాగుతున్న కమీషన్ పద్ధతిలో చెల్లింపులు తొలగించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు ఇవ్వాలి. రేషన్ దుకాణాల్లో ఈ-పాస్ మిషన్‌లు, ఎలాక్ట్రానిక్ కాంటాలు ఏర్పాటు చేయటం మంచి నిర్ణయమే. రేషన్ దుకాణం నిర్వహణకు ప్రతి నెల రూ.5 వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తోంది. రేషన్ దుకాణ దారులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రూ.20 వేలు చెల్లించాలి. దుకాణ కిరాయి, పనిచేసే కార్మికుడి వేతనం ప్రభుత్వమే భరించాలి. ఎలాంటి లాభాపేక్ష లేకపోయినా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అనుసంధానకర్తగా పనిచేస్తున్నాం. ఉద్యోగ భద్రత కల్పించాల్సిందిపోయి తొలగించే ఆలోచనకు నేను పూర్తిగా వ్యతిరేకం. రేషన్ డీలర్ల సమ్మెతో ప్రభుత్వం కొంత వెనక్కితగ్గిందని భావిస్తున్నాను. బియ్యంతోపాటు, మిగతా అన్ని రకాల సరుకులను రేషన్‌షాపుల ద్వారా సరఫరా చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

అక్రమంగా కలపను తరలిస్తున్న లారీ పట్టివేత

కోట్‌పల్లి(బంట్వారం): కోట్‌పల్లి మండల పరిధిలోని కంకణాలపల్లి గ్రామంలో ఎలాంటి అనుతులు లేకుండా అక్రమంగా కలపను తరలిస్తున్న లారీని పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఇబ్రహీంపట్నంకు చెందిన కొందరూ చింతచెట్లు నరికి లారీలో తరలిస్తుండగా పట్టుబడడం జరిగిందని స్థానిక ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపారు. పట్టుబడిన లారీని ఫారెస్ట్ అధికారి రాములుకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

మొక్కజొన్న, కందిపంట దగ్ధం



మంటలార్పుతున్న సిబ్బంది

పరిగి: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మొక్కజొన్న, కంది పంట దగ్ధమైంది. మండల పరిధిలోని రంగాపూర్ గ్రామానికి చెందిన అంజిరెడ్డి సాగు చేసిన మూడెకరాల మక్కలను ఒక దగ్గర కుప్ప పోశాడు. శుక్రవారం సాయంత్రం పొలం గుండా వెళ్ళిన విద్యుత్ లైన్ వేలాడి ఉండడం ద్వారా విద్యుత్‌వైరు తగిలి మంటలు చేలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేలోపే పంట కాలిబూడిదయింది. రూ.50 వేలకుపైగా నష్టం జరిగిందని బాధితుడు అంజిరెడ్డి తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

టిప్పర్ తగిలి విద్యుత్ స్తంభాలు ధ్వంసం

- కంసాన్‌పల్లి(ఎం) మార్గంలో ఘటన
- డ్రైవర్‌కు తృటిలో తప్పిన ప్రమాదం
- ఐదు గ్రామాలకు నిలిచిన విద్యుత్ సరఫరా

బషీరాబాద్: బషీరాబాద్ మండలం రెడ్డిఘణాపూర్ పంచాయతీ కంసాన్‌పల్లి(ఎం) రోడ్డు మార్గంలోని విద్యుత్ మెయిన్ వైర్లకు టిప్పర్ బాడీ తగిలిన ప్రమాదంలో హైటెన్షన్ వైర్లు తెగిపోయి డ్రైవర్ తృటిలో ప్రమాదం తప్పింది. ఈ సంఘటన శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. కంసాన్‌పల్లిలో రోడ్డు పనులకు గాను కంకర లోడ్‌తో వచ్చిన టిప్పర్ ఖాళీ చేసి వెళుతుండగా, టిప్పర్ జాక్ కిందకు దిగకపోవడంతో డ్రైవర్ వాహనాన్ని అలాగే పోనిచ్చాడు. ఈ రోడ్డు మార్గంలో ఇరువైపులా వెళుతున్న 11కేవీ విద్యుత్ వైర్లకు పైకి లేచి ఉన్న టిప్పర్ బాడీ తగిలి వైర్లు తెగి నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగి పొడ్డాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ తృటిలో తప్పించుకున్నాడు. ఈ సంఘటనతో ఐదు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఘటన స్థలాన్ని ఆ శాఖ ఏఈ సందీప్‌కుమార్ పరిశీలించారు. ఘటనపై విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం కరెంటు పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

గ్రంథాలయాల నిధులకు కృషి చేస్తా

- పన్నుల నుంచి 8 శాతం గ్రంథాలయానికి కేటాయించాలి
- ఎమ్మెల్యే సంజీవరావు
- జిల్లాలో మూడు కొత్త గ్రంథాలయాలు నిర్మిస్తాం
- గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశంలో సంస్థ చైర్మన్ కొండల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

వికారాబాద్ అర్బన్: గ్రామ పంచాయతీల నుంచి జిల్లా గ్రంథాలయాలకు రావాల్సిన నిధులు వచ్చేలా కృషి చేస్తామని వికారాబాద్ ఎమ్మెల్యే బి.సంజీవరావు అన్నారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో కొండల్‌రెడ్డి అధ్యక్షతన పాలకవర్గం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల నుంచి జిల్లా గ్రంథాలయ సంస్థకు రావాల్సిన సెస్సు బకాయిల వసూలుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి సంస్థ చైర్మన్ కొండల్‌రెడ్డి కృషి చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండల్‌రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో 5 వేల జనాభా ఉన్న ప్రతి గ్రామానికి గ్రంథాలయం ఏర్పాటు చేయడానికి పాలకవర్గం తీర్మానించిందని అన్నారు. అదే విధంగా మర్పల్లి, తాండూరులో శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయ భవనాలను కూల్చివేసి కొత్తగా భవనాలు నిర్మించేందుకు నిర్ణయించామని, కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్‌తో పాటు పరిగి నియోజకవర్గంలోని దోమలో కొత్తగా గ్రంథాలయాలు నిర్మించాలని నిర్ణయించామని చెప్పారు. వికారాబాద్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు రూ.1.2 కోట్ల తో ప్రతిపాదనలు పంపించడం జరుగుతోందని, తాండూరు గ్రంథాలయం స్థలంలోనూ షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తామని అన్నారు. జిల్లాలో 18 మండలాల్లో ఉన్న గ్రంథాలయాల్లో విద్యుత్, శుద్ధమైన మంచినీటి సదుపాయం, ఫర్నీచర్, పెయింటింగ్ వేయించాలని తీర్మానించామని చెప్పారు. పరిగిలోని శాఖా గ్రంథాలయం ఆవరణలో ఉన్న నాలుగు దుకాణాలను వెంటనే ఖాళీ చేయించి ఓపెన్ యాక్షన్ ద్వారా ఇతరులకు కేటాయిస్తామని అన్నారు. వికారాబాద్ మండలంలోని బూర్గుపల్లి, మర్పల్లి మండలంలోని పంచలింగాల్, వీర్లపల్లి గ్రామాల్లో బీడీసీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థకు గ్రామ పంచాయతీల నుంచి గత ఐదారేళ్లుగా రూ. 50 కోట్ల వరకు సెస్సు బకాయిలు వసలూ కావాల్సి ఉందన్నారు. ఈవిషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి సెస్సు బకాయిలు గ్రంథాలయ సంస్థకు వచ్చేలా చూస్తామని, ఆ నిధులతో గ్రంథాలయాలను మరింత అబివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లాలో గ్రంథాలయాల్లో సిబ్బంది కొరత పరిష్కారం కోసం 107 ఖాళీలు భర్తీ చేసేందుకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని, మార్చి తరువాత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీలను భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ తరగతులు ప్రారంభించామని, గ్రూప్-2కు మాత్రం సంక్రాంతి తరువాత తరగతులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రాణి, డైరెక్టర్లు దయాకర్‌రెడ్డి, ఎ.భారతమ్మ, బంగ్లా యాదయ్య, మొగులప్ప, శోభారాణి, సిబ్బంది లక్ష్మప్ప, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు

- ప్రభుత్వ కార్యక్రమాల్లో వేగం పెంచాలి
- వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు
- జిల్లాలో భూ పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలి
- ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి
- సమీక్షా సమావేశంలో కలెక్టర్ సయ్యద్ ఒమర్ జలీల్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

(ఆంధ్రజ్యోతి, వికారాబాద్) రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సయ్యద్ ఉమర్ జలీల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన సాయంత్రం జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపైన వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాల అమల్లో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు. వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు అంచనాలు రూపొందించాలని, ముఖ్యంగా బాలికల సంక్షేమ వసతి గృహాల్లో మరుగుదొడ్లు, ఇతర సదుపాయాలు కల్పించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డీఈవోను ఆదేశించారు. భూకొనుగోలు పథకం కింద భూమి కొనుగోలు చేసి జిల్లాలో నిరుపేద ఎస్సీలకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం కేసీఆర్ కిట్ పథకం అమలు చేస్తోందని, ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. పంట బీమా చేసుకున్న రైతులకు తప్పనిసరిగా రసీదు అందజేయడమే కాకుండా వారికి నష్టం వాటిల్లినప్పుడు పరిహారం అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పోలీసు శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి ఎస్పీ అన్నపూర్ణ కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో జేసీ సంధ్యారాణి, ఆర్డీవోలు విశ్వనాథం, వేణుమాధవరావు, వివిధ శాఖల అధికారులు జాన్సన్, గోపాల్, సంజయ్‌కుమార్, పద్మజ, జ్యోత్స్న, పుష్పలత, దశరథ్, హరిణి, సదాశివుడు, చంద్రశేఖర్‌రావు, సమ్మయ్య, మాజీద్, ప్రతాప్, మనోహర్‌రావు, హన్మంత్‌రావు, అనంతచారి పాల్గొన్నారు.

రెండో రోజూ స్వచ్ఛసర్వేక్షణ్ బృందం తనిఖీలు

- కార్యాలయంలో రికార్డుల పరిశీలన
- వార్డుల్లో తిరిగి సమాచార సేకరణ



రికార్డులు తనిఖీ చేస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ అధికారి

వికారాబాద్ అర్బన్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా రెండవ రోజు కేంద్ర బృందం తనిఖీ నిర్వహించింది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా వికారాబాద్ స్వచ్ఛతపై మార్కులను నిర్వహించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి కేంద్ర బృందం వేరు వేరుగా విడిపోయి ఒకరూ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఇంకో ఇద్దరు ఆలంపల్లి, బీటీసీ, కొత్తగడి తదితర వార్డుల్లో తిరిగినట్లు తెలిసింది. వార్డుల్లో స్వచ్ఛతపై ప్రజలతో ఆరా తీయడంతో పాటు, చెత్త సేకరణ ఏ విధంగా ఉందని అడిగి తెలుసుకున్నారు. తడి చెత్త పొడి చెత్తపై మునిసిపల్ అధికారులు అవగాహన ఏ విధంగా అధికారులు చేస్తున్నారు. వాటిని ఎలా తరలిస్తున్నారని విషయాలు ప్రజల నుంచి తెలుసుకున్నారు. బడ్డీ యాప్ గురించి మీకు ఎంత వరకు తెలుసు వాటి ద్వారా ఎలాంటి పరిష్కారాలు చేసుకోవచ్చు అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వీరు శనివారం మధ్యాహ్నం వరకు వికారాబాద్‌లో ఉండే అవకాశాలు ఉన్నాయి. స్వచ్ఛసర్వేక్షణ్ యొక్క పూర్తి వివరాలు రేపు తెలియజేయనున్నట్లు తెలుస్తుంది. ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణరెడ్డి , డీఈ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

బతుకమ్మ చీరలు వెనక్కి

- 2,921 చీరలు వెనక్కు పంపిన మునిసిపల్ అధికారులు

వికారాబాద్ అర్బన్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపడంతో పాటు ప్రతి మహిళకు కొత్త చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించి ప్రతి మహిళకు బతుకమ్మ చీరలను పంపిణీ చేసింది. కొన్ని ప్రాంతాల్లో బతుకమ్మ చీరల పంపిణీ అప్పుడు నాణ్యత లేవని చీరలు నిప్పు పెట్టడం వంటి సంఘటనలు జరిగాయి. వికారాబాద్ పట్టణంలో బతుకమ్మ చీరలు పంపిణీ చేసేందుకు సుమారు 13 వేల చీరలను వికారాబాద్‌కు ప్రభుత్వం అందించింది. దీంతో మునిసిపల్ అధికారులు పట్టణంలో పలు వార్డుల్లో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఇదిలా ఉంటే చీరలు బాగా లేవని, నాణ్యత లేని చీరలు అంటగడుతున్నారని చాలా మంది మహిళలు చీరలు తీసుకునేందుకు ముందుకు రాలేదు. దీంతో చాలా చీరలను వికారాబాద్ మునిసిపల్‌లోనే ఉంచారు. శుక్రవారం 2921 చీరలను మునిసిపల్ అధికారులు గోదాంకు ట్రాక్టర్‌లో తరలించారు.



బతుకమ్మ చీరలను ట్రాక్టర్లలో ఎక్కిస్తున్న మునిసిపల్ సిబ్బంది

అక్రమంగా తరలిస్తున్న బంగారం పట్టివేత

శంషాబాద్ రూరల్ : విదేశాల నుంచి అక్రమంగా దిగుమతి చేసుకుంటున్న బంగారాన్ని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయ కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ జడ్డా నుంచి 353 గ్రాముల బంగారాన్ని చేతికున్న గాజుల్లో పెట్టుకుని వస్తుండగా కస్టమ్స్ అధికారుల తనిఖీలో ఆమెను విచారించగా నేరం అంగీకరించింది. దీంతో అధికారులు బంగారాన్ని సీజ్ చేసి మహిళను విచారిస్తున్నట్లు తెలిపారు. బంగారం విలువ దాదాపు రూ. 11 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. నిందితురాలిని నగరంలోని కస్టమ్స్ కార్యాలయానికి తరలించినట్లు చెప్పారు. కేసు విచారణలో ఉందని అధికారులు తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కులకచర్ల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని మండల రైతు సమన్వయ సమితి కో-ఆర్డినేటర్ బాల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని పీరంపల్లి గ్రామంలో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 లక్షల 50 వేలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు 14వ ఆర్థిక సంఘం నిధులు విడుదల య్యాయని అన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్డు పనులు, మురుగు కాలువల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లమ్మ, కార్యదర్శి మాణిక్యం, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రతి రైతూ రూపే కార్డును వినియోగించుకోవాలి

గో-డిజిటల్‌పై అవగాహన సదస్సు ▸▸ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు

పరిగి: రైతులందరూ నగదు రహిత లావాదేవిలపై చైతన్య వంతులు కావాలని పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్.ఆంజనేయులు, పరిగి మండల పీఏసీఎస్ చైర్మన్ కొప్పుల శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పరిగి పీఏసీఎస్ కార్యాలయంలో గో-డిజిటల్‌పై జరిగిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ, ప్రతి రైతు తమ అవసరాలకోసం రూపే కార్డును ఉపయోగించుకోవాలని సూచించారు. డబ్బును బ్యాంకుల్లో దాచుకోవడం ద్వారా భద్రత ఉంటుందని తెలిపారు. రైతుల రుణాలను కూడా తమ సేవింగ్ ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎరువుల కొనుగోలు చేయాలంటే షాపుల్లో నగదు ఇవ్వకుండా రూపే కార్డు స్వైప్ చేసి తీసుకోవాలని సూచించారు. బ్యాంకు పరంగా ఏలాంటి సమస్యలు వచ్చిన తాము పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ మేనేజర్ జె.వెంకటయ్య, పీఏపీఎస్ సీఈవో అమరేందర్‌రెడ్డి, సూపర్‌వైజర్ వెంకటయ్య, అక్షిత్, శిరిష్, డైరెక్టర్లు చుక్కయ్య, పులిందర్‌రెడ్డి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న చైర్మన్ ఆంజనేయులు

ప్రజా చైతన్యం కోసమే టీ-మాస్

జిల్లా చైర్మన్ డాక్టర్ సాధెసత్యనాథన్

పరిగి: ప్రజల్లో చైతన్యం తీసుకవచ్చేందుకు నెలపాటు గ్రామాల్లో విస్త్రతపరిచే కార్యక్రమాలను చేపడుతున్నట్లు టీ-మాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ సాధెసత్యనాథన్, జిల్లా కన్వీనర్ పి.మల్లేశం అన్నారు. శుక్రవారం పరిగిలో టీ-మాస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న వారు మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు 93 శాతం జనాభా ఉందని, 70 ఏళ్ళ స్వాతంత్ర్యంలో పేదలను ఆశలు చూపి విభజించి పాలించారని ఆరోపించారు. ఏడు శాతం ఉన్న పెత్తందార్లు అధికారాన్ని ఉపయోగించుకుని లక్షల కోట్ల ప్రజా ధనాన్ని కొల్లగొడుతూ వస్తున్నారని ఆరోపించారు. కులమతాలకతీతంగా ప్రజలను ఏకం చేసేందుకు టీ-మాస్ ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై టీమాస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో టీ-మాజీ జిల్లా కమిటీ సభ్యులు గోవింద్‌నాయక్; ఎం.వెంకటయ్య, మొగులయ్య, రజక సంఘం నాయకురాలు వనజ, ఆయా సంఘాల నాయకులు న్యాయవాది గౌస్, మంగమ్మ, వెంకటేశ్, రవీంద్ర, ఎంవీఎఫ్ రాములు, లాజర్, ఆనంద్, శ్రీనివాస్, కృష్ణ, చందర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్

ఆర్టీసీ కార్మికుల గేట్ ధర్నా

పరిగి: కేంద్రప్రభుత్వం రోడ్డు సేఫ్టీ బిల్లును తీసుకరావడాన్ని నిరసిస్తూ, టీఎంయూ డిపో కార్యదర్శి జెఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో పరిగి డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు ఎర్రబ్యాడ్జిలు ధరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో అధ్యక్షుడు ఎంహెచ్ సిద్దిఖీ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకోస్తున్న రోడ్డు సెఫ్టీ చట్టంతో ఆర్టీసికి తీవ్ర నష్టం చేయనుందని తెలిపారు. రోడ్లపై జరిగే ప్రమాదాలకు డ్రైవర్లను బాధ్యులను చేయడం సరికాదన్నారు. ఆర్టీసి రూట్లలో ప్రైవేట్ బస్సులకు పర్మిట్లు ఇచ్చే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ సంఘం నాయకులు మల్లయ్య, నిరంజన్, సురేష్‌బాబు, శ్యాంసుందర్, జంగయ్య, విశ్వనాథ్‌గౌడ్, కె.బాలు, ఎన్‌బి రాజు తదితరులు పాల్గొన్నారు.


డిపో ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

'సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి'

దోమ: సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పింఛన్ విధానంను అమలు చేయాలని టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని ఐనాపూర్, దిర్సంపల్లి, దాదాపూర్, మోత్కూర్, మల్లెపల్లి, ఊటుపల్లి, దోమ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో నూతన సంవత్సర వాల్ పోస్టర్ విడుదల చేసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి సున్నగంటి రాజు, దోమ మండల శాఖ గౌరవ అధ్యక్షుడు జాంప్లా, మండల ప్రధాన కార్యదర్శులు ఎండి.రఫీ, జనార్దన్, కార్యదర్శి ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

పాత విధానమే కొనసాగించాలి

పూడూరు: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని టీయూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పూడూరు మండల పరిధిలోని చన్‌గోముల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీయూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఊరెళ్ల విఠల్ గ్రామ సర్పంచ్ అనంతమ్మతో కలసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించే వరకు టీయూటీఎఫ్ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఆంజనేయులు, పి.మహిపాల్, జిల్లా కార్యదర్శి అనిత, ఎం.నర్సింలు, బస్వరాజ్, బి.ప్రభాకర్, జయంతి, తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

'శనగ' సాగుపై అవగాహన

పరిగి: రైతులే స్వయంగా విత్తనాలు తయారు చేసుకోవడం ద్వారా ఖర్చులను తగ్గించుకోవచ్చని రాజేంద్రనగర్ వ్యవసాయ క్షేత్రం శాస్త్రవేత్త ఎం.శివశంకర్, అధికారులు ఆర్.రవినాథ్, వై.లావణ్య, పరిగి మండల ఏవో వి.గంగాధర్ అన్నారు. ధ్రువీకరణ విత్తనోత్పత్తి పథకం కింద రెండవ విడతలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని తొంగపల్లి, యాబాజీగూడ గ్రామాల్లో శనగ పంట సాగు చేసిన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శనగ పంట ప్రస్తుతం పూత, గింజ దశలో ఉందని, ఈ దశలో మెలకువలు పాటిస్తే విత్తనం నాణ్యతగా వస్తుందని తెలిపారు. ప్రస్తుత దశలో నీటి సదుపాయం ఉన్న రైతులు పల్చటి తడిని ఇవ్వడం ద్వారా 15 వరకు దిగుబడి పెరుగుతుందని తెలిపారు. శనగపచ్చ పురుగు నివారణకు మోనోక్రోటోపాస్ 1.6 మి.లీ. లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఎండు తెగులు సోకిన పంటకు ట్రైకోడెర్మా విరిడి 4 గ్రాములకు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయడం ద్వారా పంట ఆరోగ్యకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో శశిదర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

మోసాలకు పాల్పడితే చర్యలు: ఆర్ఐ

దోమ: రేషన్ సరుకుల పంపిణీ తూకాల్లో మోసాలకు గురి కాకుండా కార్డుదారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆర్ఐ సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో రేషన్ షాపు తూకాల్లో అవకతవకలు జరుగుతున్నాయన్న ఫిర్యాదు మేరకు రేషన్ షాపును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేషన్ షాపుల్లో కార్డుదారులకు తూకాల్లో తక్కువ వస్తుందని ఫిర్యాదు మేరకు రేషన్ షాపును తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు. కార్డుదారులకు తూకం వేసే ఎలక్ట్రానిక్ మిషన్‌ను పరిశీలించగా ఎలక్ట్రానిక్ మిషన్‌లో ఎలాంటి లోపాలు లేవని, సక్రమంగా ఉందన్నారు. రేషన్ సరుకులు తీసుకున్న లబ్దిదారులు తూకాలలో మోసం జరుగుతుందని రేషన్ డీలరును అక్కడే నిలదీయాల్సి ఉండగా సరుకులు తీసుకున్న కొన్ని గంటల తరువాత తూకాల్లో తక్కువగా వస్తున్నాయని వస్తే మాకు ఎలాంటి సంబంధం లేదని డీలరు కార్డులకు తెలియజేశారు. ఈ విషయంపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు.

'రాయితీలను వినియోగించుకోవాలి'

పూడూరు: ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బస్‌పాస్‌లను వికలాంగ అభ్యర్థులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సుధారాణి అన్నారు. శుక్రవారం సెర్ప్ కార్యాలయంలో సెర్ప్, ఆర్టీసీ ఆధ్వర్యంలో వికలాంగ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి 70 మంది వికలాంగ అభ్యర్థులు బస్‌పాస్‌లకోసం దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వారం రోజుల్లో ఉచిత బస్‌పాస్‌లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కొమురయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు గాయత్రి, మండల వికలాంగుల సంఘం అధ్యక్షుడు రమేష్, పాల్గొన్నారు.

తిర్మాలాపూర్‌లో

యువకుల శ్రమదానం

కులకచర్ల: మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో యువకులు వివేకానంద విగ్రహం ఏర్పాటు కోసం శ్రమదానం చేశారు. గ్రామ పరిధిలో వివేకానంద విగ్రహం ఏర్పాటు కోసం యువకులంతా గోతులు తవ్వారు. ఈ నెల 12న వివేకానందుడి జయంతి సందర్భంగా విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేయనున్నట్లు యువకులు తెలిపారు. గ్రామంలోని ప్రధాన కూడళి దగ్గర వివేకానందుడి విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వివేకానందుడి స్ఫూర్తితో గ్రామంలోని యువకులంతా పలు కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ గౌడ్, గ్రామ యువకులు సత్తెయ్య, శ్రీనివాస్, కృష్ణయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చౌడాపూర్ వీఆర్ఏ మృతి

కులకచర్ల: మండల పరిధిలోని చౌడాపూర్ వీఆర్ఏ జంగయ్య(60) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. గిర్దావర్ అనంతసేన్‌రావు గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం రూ.10 వేలు మృతుడి కుటుంబానికి అందజేశారు. ప్రభుత్వం తరుపున కుటుంబానికి సహాయం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్ఏ, వీఆర్వోల సంఘం నాయకులు నర్సింహులు, భీమయ్య, నీలయ్య, బందయ్య, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి

ఖుదావంద్‌పూర్‌లో క్రికెట్ పోటీలు

పరిగి: మండల పరిధిలో ఖుదావంద్‌పూర్ గ్రామ ఫ్రేండ్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల ఏడు నుంచి ఎస్.నరసింహ్మారాజు స్మారక క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు పి.నర్సింహులు, వై.నర్సింహులు, వై.మొగులయ్య, కృష్ణయ్య, మారుతి, బి.రాజు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలిచిన వారు రూ.500ల ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన జట్లుకు ఫస్ట్ బహుయతి రూ.10 వేల నగదు, రెండవ బహుమతి రూ.5 వేల నగదును అందజేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 8790599215, 961420310లను సంప్రదించాలని సూచించారు.

నేడు మిట్టకోడూరుకు మంత్రి రాక

పరిగి: మిషన్‌కాకతీయ-4లో భాగంగా మండల పరిధిలోని మిట్టకోడూరు పెద్ద చెరువులో రూ.32 లక్షలతో చేపట్టే పనులను శనివారం ఉదయం రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పి.మహేందర్‌రెడ్డి ప్రారంభిస్తారని ఇరిగేషన్ పరిగి డీఈఈ రామార్జున్ తెలిపారు. మంత్రితోపాటు, ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి కూడా పాల్గొంటారని తెలిపారు.

‘విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం’

కొడంగల్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని టీపీయూఎస్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటయ్య, క్రాంతికుమార్, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీహెచ్‌ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో 2018 నూతన సంవత్సరం క్యాలండర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తూ పోరాటం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణయ్య, రాములు, సిద్దుమల్లేశ్, బాల్‌రాజ్, శ్రీనివాస్, నారాయణ, చంద్రకాంత్, పూర్ణిమా, రజిత, బస్వలింగమ్మ, సుజాత, శారద, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

నత్తకు నడక నేర్పుతున్న హైవే పనులు..

30 కిలోమీటర్ల ప్రయాణానికి గంటన్నర
ఇబ్బందుల్లో ప్రయాణికులు, వాహనదారులు

కొడంగల్‌రూరల్: మన్నెగూడ నుంచి రావుల్‌పల్లి వరకు జరుగుతున్న హైవే నిర్మాణ పనులు నత్తకు నడక నేర్పే విధంగా కొనసాగడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కర్నాటక సరిహద్దు నుంచి కొడంగల్, బొంరాస్‌పేట్ మీదుగా మన్నెగూడ వరకు , కొడంగల్ నుంచి పరిగికి ప్రయాణించాలంటే దాదాపు గంటన్నర సమయం పడుతుండటంతో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇంతకు ముందు పరిగి వరకు వెళ్లాలంటే దాదాపు 40 నిమిషాలు పట్టేది. రోడ్డు నిర్మాణ పనుల కోసం రోడ్డుకిరువైపులా ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మాణంతో ఒక వాహనం ఎదురుగా వస్తుందంటే మరో వాహనం ఆగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకు తోడు దుమ్ము, దూళి ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులను కలిగిస్తుంది. హైవే నిర్మాణ పనుల్లో భాగంగా మధ్య, మధ్యలో రోడ్డును తవ్వడంతో ప్రయాణపరంగా ఇబ్బందులు తప్పడం లేదు. తరచూ ప్రమాదాలు సంభవించడంతో వాహనదారులు ఈ రోడ్డు మీదుగా ప్రయాణం కొనసాగించాలంటే భయాందోళన చెందుతున్నారు. పట్టణ శివారులో బండెల ఎల్లమ్మ నుంచి రావుల్‌పల్లి వరకు రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నా పనులు వేగవంతంగా కొనసాగకపోవడంతో ఇటు ప్రయాణికులు, వాహనదారులు రాత్రి వేళల్లో భయాందోళన మధ్య ప్రయాణం చేయాల్సిన పరిస్థితి దాపరించిందని వాపోతున్నారు.


పనుల కోసం తవ్విన రోడ్డు

ముదిరాజ్‌ల అభివృద్ధిపై సర్కారు దృష్టి
సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాశ్

కొడంగల్ రూరల్: ముదిరాజ్‌లు, మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండప్రకాశ్, అందెబాబన్న, మహబూబ్‌నగర్ మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. నారాయణపేట్ సమావేశంలో భాగంగా కొడంగల్ మీదుగా వెళ్తూ శుక్రవారం మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో జడ్పీ మాజీ వైస్ చైర్మెన్ కృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్‌లను ఏకతాటిపైకి తీసుకువచ్చి విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో రాణించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్‌ల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉచితంగా చేప పిల్లల పంపిణీ, సబ్సిడీ రుణాలు తదితర వాటిని అందిస్తూ ప్రోత్సహిస్తున్నారన్నారు.


బండ ప్రకాశ్‌ను సన్మానిస్తున్న కృష్ణ

న్యాయవాదుల సంక్షేమానికి పోరాటం
రాష్ట్ర ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు అనంత్‌రెడ్డి

కొడంగల్: తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రధాన పాత్ర పోషించిన న్యాయవాదులను ప్రభుత్వం విస్మరించడం సరైంది కాదని రాష్ట్ర ఫెడరేషన్, మహబూబ్‌నగర్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అనంత్ రెడ్డి, గడ్డంగోపాల్ అన్నారు. శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2018 క్యాలండర్ ఆవిష్కరణ చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో బారికేడ్లను, జల ఫిరంగిలను లెక్క చేయకుండా ఢిల్లీలో పార్లమెంట్‌ను ముట్టడించిన ఘనత న్యాయవాదులదే అన్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమానికి ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. సెక్షన్ 41 సీఆర్‌పీసీకి ప్రభుత్వం సవరణ చేపట్టి జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10వేల చొప్పున చెల్లించి ప్రతి బార్ కౌన్సిల్‌లో డిజిటల్ లైబ్రరిని ఏర్పాటు చేయాలన్నారు.

హైదరాబాద్‌లో రూ.100 కోట్లతో లా అకాడమిని ఏర్పాటు చేసి న్యాయవాదులకు పునచ్ఛరణ తరగతుల ఏర్పాటుతో హెల్త్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన న్యాయవాదులకు ఇళ్ల స్థలాలను కేటాయించి డెత్, రిటైర్మెంట్ బెన్‌ఫిట్‌గా రూ.10 లక్షలు చెల్లించాలన్నారు. సమావేశంలో న్యాయవాదులు టీ.రాములు, సుధాకర్‌రెడ్డి, బస్వరాజ్, ఆనంద్, మధుసూదన్‌రెడ్డి, వెంకటయ్య, రాములు, శకనప్ప తదితరులు పాల్గొన్నారు.


క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు ఎక్కడ..?
ఎంపీడీవో ఆగ్రహం

బొంరాస్‌పేట్: రికార్డుల్లో మాత్రమే పిల్లలు ఉంటారు, అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు ఎక్కడా అంటూ అంగన్‌వాడీ టీచర్లపై ఎంపీడీఓ హరినందన్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన దుద్యాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన తనిఖీ చేసే సమయంలో కేంద్రంలో నలుగురు చిన్నారులు తప్ప ఏ కేంద్రంలో పిల్లలు లేకపోవడంతో అవాక్కయ్యారు. పిల్లలు లేనిదే కేంద్రాల్లో టీచర్, ఆయా ఎందుకంటూ మండిపడ్డారు. తిరిగి తనిఖీ చేసే వరకు కేంద్రాల్లో రికార్డుల్లో ఉన్నట్లుగా చిన్నారులు ఉండాలని ఆదేశించారు.

నర్సరీల తనిఖీ

బొంరాస్‌పేట్: మండలంలో ఫారెస్టు శాఖ ద్వారా పెంచుతున్న మొక్కలను విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. శుక్రవారం విజిలెన్స్ అధికారి విజయానందరావు, కొడంగల్ రేంజ్ అధికారి ఎండీ.యూసుఫ్‌పాష నర్సరీలను తనిఖీ చేశారు. బొంరాస్‌పేట్, బురాన్‌పూర్, ఏనమీదితండా, కొత్తూర్ సెంట్రల్ నర్సరీని తనిఖీ చేశారు.

ఘనంగా మహబూబ్‌సుభానీ దర్గా ఉత్సవాలు

దౌల్తాబాద్: మండల పరిధిలోని దేవరఫస్లాబాద్ గ్రామంలో మహబూబ్‌సుభానీ దర్గా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం గంధోత్సవం, శనివారం కందూర్‌లు తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలిపారు. దర్గా ఉత్సవాలకు మండల పరిధిలోని గ్రామాలతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున హాజరు అవుతారు.

‘జయతీర్థచారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలి’



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

బొంరాస్‌పేట్: నిరుపేద దళిత కులానికి చెందిన మహేశ్వరం వెంకటప్పను మోసం చేసి తాను సాగు చేసిన పంటను అధికారులు కోసే విధంగా చేసిన జయతీర్థచారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి వెంటనే రిమాండ్‌కు తరలించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, సీపీఎం నాయకులు బుస్స చంద్రయ్య, న్యాయవాది భవనప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మండల కేంద్రంలో విలేఖరులతో మాట్లాడుతూ రేగడిమైలారం గ్రామానికి చెందిన బ్రాహ్మణ కులస్థుడు జయతీర్థచారి దళిత కులానికి చెందిన మహేశ్వరంవెంకటప్ప అనువంశిక భూమి రికార్డులను తారుమారు చేసి కోర్టుకు ఈడ్చి మానసికంగా హింసకు గురి చేయడంతో చర్యలు తీసుకోవాలన్నారు. 1947 నుంచి మహేశ్వరం వెంకటప్ప తాతలు వెంక, సందలకు చెందిన భూమిని వారసొంతంగా పొందినా 1961లో జయతీర్థచారి తప్పుడు రికార్డులను సృష్టించి ఇటు ప్రభుత్వ అధికారులతో పాటు కోర్టులను మోసగించిన సంఘటనలో కేసు నమోదు చేయాలన్నారు. ప్రైవేట్ పిటిషన్ వేసి నోటీసులు ఇచ్చినా స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆయనకు వంత పాడటం తగదన్నారు. ఎంతో కష్టనష్టాలను ఓర్చి పంటను సాగు చేసిన వెంకటప్పకు వెంటనే సాగు ఖర్చులు చెల్లించాలన్నారు. లక్ష్మణ్, వెంకటయ్య, రాములు, బంద్యప్ప, రత్నం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పనులు ప్రారంభం

బొంరాస్‌పేట్: మిషన్ భగీరథ పథకంలో భాగంగా మండల పరిధిలోని మెట్లకుంట గ్రామంలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేశారు. శుక్రవారం మెట్లకుంట గ్రామంలో వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను ఎంపీటీసీ నర్సిములు నాయుడు, రైతు సమన్వయ కమిటీ మండల కన్వీనర్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జయక్రిష్ణ చేతుల మీదుగా పనులను ప్రారంభించారు. వాటర్ ట్యాంకు నిర్మాణానికి రూ.20 లక్షల 49 వేల 500 మంజూరైనట్లు కాంట్రాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు.


మెట్లకుంటలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

‘అభివృద్ధి పనులు అడ్డుకుంటే ఉద్యమం’

కొడంగల్: వెనకబడిన కొడంగల్ ప్రాంతంలో అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే విద్యార్థులతో కలిసి ఉద్యమం తప్పదని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎనుముల తిరుపతిరెడ్డి, ఎండీ.యూసుఫ్, నందారం ప్రశాంత్ తదితరులు అన్నారు. శుక్రవారం వారు స్థానిక ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నియోజకవర్గంపై కక్షతో అభివృద్ధికి నిధులను మంజూరు చేయకపోయినా ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి గేల్ సంస్థ ద్వారా నిధులు మంజూరు చేయించినా పనులు జరగకుండా అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. దౌల్తాబాద్ మండలంలో జూనియర్ కళాశాల నిర్మాణానికి గ్యాస్ అథారిటి ద్వారా నవంబర్ 16న రూ.3కోట్ల 50 లక్షలు మంజూరు కాగా డిసెంబర్ 4న పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఇందుకు కళాశాల నిర్మాణ పనులను ఆపేందుకు మద్దూర్ జడ్పీటీసీ అనసూయబాల్‌సింగ్ నాయక్‌తో గేల్ సంస్థకు ఫిర్యాదు చేయడంతో అభివృద్ధిని అడ్డుకోవడమే అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మంజూర్ తీసుకువచ్చిన ఐటీఐ, మినీ స్టేడియం, ఆర్టీసీ బస్ డిపో తదితర అభివృద్ధి పనులు కొనసాగకుండా టీఆర్ఎస్ అడ్డుకుంటుందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు శివప్ప, కృష్ణంరాజు. ఎండీ.ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

‘అభివృద్ధి అడ్డుకోవడం సమంజసం కాదు’

దౌల్తాబాద్: కొడంగల్ నియోజకవర్గానికి నిధులు కేటాయించకుండా టీఆర్ఎస్ అడ్డుకుంటుందని టీజేఏసీ నాయకులు రెడ్డిశ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించడంతో మంత్రులు మహేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి నిధులు మంజూరు కాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

వికారాబాద్

వికారాబాద్ - అనంతగిరి - మర్పల్లి - మోమిన్‌పేట
ధారూరు - బంట్వారం - నవాబుపేట

'ప్రతి కుటుంబం మరుగుదొడ్డి నిర్మించుకోవాలి'

మోమిన్‌పేట: ప్రతి కుటుంబం మరుగుదొడ్లు నిర్మించుకోవాలని సర్పంచ్ వడ్ల చంద్రయ్య సూచించారు. గురువారం రాత్రి మరుగుదొడ్ల నిర్మాణంపై కళాజాత బృందం ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.కార్యక్రమంలో ఎఫ్ఏ శ్రీనివాస్, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.



హాస్టల్‌లో నిత్యావసరాలు ఏర్పాటు చేయాలి

● ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు

వికారాబాద్ అర్బన్: జిల్లాలో ఉన్న వసతి గృహాల్లో విద్యార్థులకు నిత్యవసరాలైన మంచినీటి సౌకర్యం, మూత్రశాలలు, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వర్ రావు అన్నారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా రూరల్ కమిటీ ఆధ్వర్యంలో రెండవ మహాసభలు స్థానికంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్, ఫీజురియంబర్స్ మెంట్, విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు అనుగుణంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. వికారాబాద్‌లో యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. కేజీ టూ పీజీ ఉచిత విద్యను అమలు చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా యాదగిరి, కార్యదర్శిగా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా సతీష్, నాగవర్ధన్, సహాయ కార్యదర్శిగా పరమేశ్వరి, అనిల్, ప్రవీణ్ శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల నుంచి నాయకులు పాల్గొన్నారు.

అయుత ధర్మదీక్షను విజయవంతం చేయాలి

ధారూరు: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం టీయూటీఎఫ్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎంఈవో బాబుసింగ్, సంఘం జిల్లా ఆధ్యక్షుడు విఠల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా విఠల్ మాట్లాడుతూ. ఈ నెల 7న తలపెట్టిన ఆయుత ధర్మ దీక్షను విజయవంతం చేయాలని కోరారు. 2004 తర్వాత నియామాకమైన ఉపాధ్యాయ, ఉద్యోగులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఆయన డిమాండు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటయ్య, భాస్కర్, రాజేందర్, విష్ణువర్ధన్, యాదయ్య, జగదీష్, జంగయ్య, క్రిష్టయ్య, లక్ష్మి, మాణెమ్మ, నర్సింలు పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో..

బషీరాబాద్: ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని పాతర వేయడానికి ఈనెల 7న గజ్వేల్‌లో జరిగే ఆయుతధర్మ దీక్షను విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్ ఈయూ మండలాధ్యక్షుడు ఎండి.మునవీర్ కోరారు. ఈ సందర్భంగా ఆయుత ధర్మదీక్ష పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

అన్నదాన సేవకులు.. ఆర్యవైశ్య యువకులు



అన్నదానం చేస్తున్న ఆర్యవైశ్య యువకులు

అనంతగిరి: అన్నదానం చేయడం, ఇతర సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్య యువకులు ముందున్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అనంతగిరి అనంత పద్మనాభస్వామి వారి ఆలయ ఆవరణలో ఆదివారం వచ్చిందంటే చాలు ఈ ఆర్యవైశ్య యువకులు అన్నదానం చేసేందుకు వాలిపోతారు. రెండు సంవత్సరాలుగా ప్రతి ఆదివారం ఆలయానికి వచ్చే భక్తులకు అన్నం పెడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇక్కడ అన్నదానం కోసం ప్రతి ఆదివారం యాచకులు, పేదలు వీరి కోసం వేచి చూస్తుంటారు. స్థానిక వికారాబాద్ పట్టణంలో వంటకాలను సిద్ధం చేసుకుని మధ్యాహ్నం 12 గంటల వరకు అనంతగిరి ఆలయానికి చేరుకుంటారు. ఒక్కో ఆదివారం ఒక్కో ఆర్యవైశ్య కుటుంబం నుంచి నిధులను సేకరిస్తూ వెచ్చిస్తుంటారు. క్రమం తప్పకుండా అన్నదానం, వారం వారం అన్నదానం చేస్తూ ఇప్పటికి ఎనభై ఆదివారాలు పూర్తి చేశారు. పట్టణంలో సుమా రు మూడు వందల ఆర్యవైశ్య ఉమ్మడి కుంటుంబాలు ఉంటా యి. ఆర్యవైశ్యులు ఎక్కువగా వ్యాపారం చేస్తుండటంతో వారికి సేవ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అవకాశం తక్కువగా ఉంటుంది. అందువల్ల ఆర్యవైశ్య యువకుల ద్వార తమ సేవ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతుందని ఆర్యవైశ్య సంఘం నాయకులు పేర్కొంటున్నారు. ప్రతి ఆదివారం పట్టణంలో సంత ఉంటుంది. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పట్టణానికి వస్తారు. వీరి వ్యాపారాలు ఎక్కువ శాతం జరిగేది ఆదివారమే అయినప్పటికి యువకులు వంతుల వారీగా వచ్చి అన్నదాన సేవ కార్యక్రమాల్లో పాల్గొంటుంటారు. ప్రతి వారం భక్తులకు ఇష్టమైన పులిహోర, చక్కర పొంగలి, వివిధ రకాల స్వీట్లను అన్నంతో పాటు వడ్డిస్తుంటారు. అనంతగిరికి వచ్చే భక్తులు దీన్ని ప్రసాదంలా భావించి ఆరగిస్తుండటంతో అన్నదాన కార్యక్రమం తృప్తిని ఇస్తుందని యువకులు చెప్తున్నారు. వీరిని చూసి మరింత మంది ఇలాంటి సేవ కార్యక్రమాలు నిర్వహించాలని పలువరు భక్తులు అభిప్రాయపడుతున్నారు.

పేదల దీవెనలు చాలా తృప్తినిస్తాయి



ప్రతి ఆదివారం భక్తులు, పేదలకు వడ్డించిన తమకు అందించే దీవెనలు చాలా తృప్తినిస్తుంటాయి. అందరికి ఇలాంటి సేవ కార్యక్రమాల్లో పాలు పంచుకునే సమయం దొరకదు. తమకు ఇలాంటి సేవ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం దొరికినందుకు చాలా సంతోషంగా ఉంది. అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తాం.

- రవితేజ , అర్యవైశ్య యువజన సంఘం సభ్యుడు

ఆదివారమే ఎక్కువ మంది భక్తులు వస్తుంటారు



ఆదివారం రోజు పెద్ద సంఖ్యలో అనంతగిరి భక్తులు వస్తుంటారు. అందువల్లే తాము ప్రతీ ఆదివారం అన్నదాన కార్యక్రమం చేపడుతున్నాము. క్రమం తప్పకుండ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము. భక్తులే కాకుండా ఇక్కడి యాచకులు , పేదలు ఈ అన్నదానంలో ప్రతీ వారం పాల్గొంటుంటారు.

- రాకేశ్, ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యుడు

అన్నదానం కంటే గొప్పది లేదు



భక్తుల్లో పేదలు, ధనికులు ఉంటారు. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం కంటే గొప్ప పని ఇంకేముంటుంది. అన్నదానం కంటే గొప్ప దానం లేదని పెద్దలు చెప్తుంటారు. ప్రతీ ఆదివారం వీలైనంత వరకు అన్నదానంలో పాలు పంచుకుంటుంటాను. నాకు ఇది చాల తృప్తిని ఇస్తుంది. తమ సంఘంలో గౌరవం పెరుగుతుంది.

- చైతన్య , ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యుడు

మద్దతు ధర కల్పించేందుకే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

● ఎమ్మెల్యే బి.సంజీవరావు

ధారూరు: రైతులకు మేలు చేసేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తుందని వికారాబాద్ ఎమ్మెల్యే బి.సంజీవరావు తెలిపారు. మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో శుక్రవారం కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రైతులు పండించిన పంటలకు మద్దతు దర కల్పించేందుకు నియోజకవర్గంలో ధారూరు, వికారాబాద్, మర్పల్లిలో కంది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. రైతులు కందులను కొనుగోలు కేంద్రంలోనే విక్రయించుకొని లాభపడాలని ఆయన సూచించారు. రైతులకు చేయూతనిచ్చేందుకు సీఎం కేసీఆర్ పలు కార్యక్రమాలు చేపట్టుతున్నారని, వ్యవసాయానికి 24 గంటల పాటు ఉచిత కరెంట్ సర ఫరా చేస్తున్నారని ఆయన తెలిపారు. సొసైటీ చైర్మెన్ జె.హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ. రైతులు 12శాతం తేమ ఉన్న నాణ్యమైన కందులను కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. ఒక రైతు ఒక రోజు 25 క్వింటాళ్ల కందులను మాత్రమే తీసుకురావాలని ఆయన చెప్పారు. స్థానిక వ్యవసాయ అధికారి లేదా వీఆర్వోతో ధృవీకరణ పత్రం, పట్టాదార్, బ్యాంకు పాసుపుస్తకం, ఆదార్‌కార్డు జిరాక్సులను తీసుకురావాలని ఆయన తెలిపారు. ఖరీఫ్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో 349 మంది రైతుల నుంచి 17,298 క్వింటాళ్ల మొక్కజొన్నను కొనుగోలు చేసినట్టు తెలిపారు. మంత్రి, ఎమ్మెల్యే సహకారంతో మొదటిసారి సొసైటీ ద్వారా కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామని, రైతు లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మెన్ వేణుగోపాల్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రాంరెడ్డి, జిల్లా సభ్యుడు రాజేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సంతోష్‌కుమార్, డీసీవో హరిణి, డీసీసీబీ ఏజీఎం సతీష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి దూండానాయక్, సొసైటీ సీఈవో నర్సిహులు, డైరెక్టర్లు మల్లారెడ్డి, సత్యనారాయణగౌడ్, సమద్, ఉపసర్పంచ్ ఇబ్రహీం, నాయకులు రాములు, అంజయ్య, చిన్నయ్యగౌడ్, చెన్నయ్య, రైతులు పాల్గొన్నారు.



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరావు

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది



గ్రామ కమిటీని ఎన్నుకున్న కాంగ్రెస్ నాయకులు

● కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి

మోమిన్‌పేట: కాంగ్రెస్ కార్యకర్తలు ఆధైర్య పడోద్దని పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి అభయమిచ్చారు. శుక్రవారం మండలంలోని మేకవనంపల్లి గ్రామంలో కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నికల సమావేశం నిర్వహించి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల మనోభావాల మేరకే పార్టీ కొనసాగుతుందన్నారు. గ్రామాల్లో ప్రజా సమస్యలపై కార్యకర్తలు దృష్టి సారించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆయన తెలిపారు. పార్టీ కార్యకర్తలే సైనికులా పార్టీని ముందుకు తీసుకుపోవడంలో కార్యకర్తల ఆలోచనలకు ప్రాధాన్యం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకుల సమన్వయంతో పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శంకర్ పాల్గొనగా గ్రామ కమిటీ అధ్యక్షులుగా కృష్ణ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, కిసాన్ సెల్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షులుగా మల్లేశం, కృష్ణ, నరేష్, గోపాల్, మొగులమ్మలతో పాటు మండల యువజన నాయకులు వెంకట్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సయ్యద్ ఒమర్ జలీల్

జిల్లా అభివృద్ధే ప్రధాన లక్ష్యం

- సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం
- వెనకబడిన జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తాం
- వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు కృషి
- హరితహారంలో జిల్లా ముందుండేలా ప్రయత్నం
- పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు
- ప్రభుత్వ పథకాల అమలుపై కార్యాచరణ
- కలెక్టర్ సయ్యద్ ఒమర్ జలీల్

(ఆంధ్రజ్యోతి, వికారాబాద్)

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ఫలాలు అర్హులైన ప్రజలకు అందేలా కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ సయ్యద్ ఒమర్ జలీల్ అన్నారు. శుక్రవారం ఆయన తన కుటుంబ సభ్యులు, వివిధ శాఖల అధికారుల సమక్షంలో జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగేలా చూస్తామని, సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న హరితహారం కార్యక్రమానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. వికారాబాద్ జిల్లాలో అటవీ ప్రాంతం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, పచ్చదనం పెంపొందేలా చూస్తామన్నారు. వెనకబడిన జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు అవసరమైన చర్యలు తీసుసుకుంటామన్నారు. సుందరీకరణ విషయమై దృష్టి సారిస్తామని చెప్పారు. జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక ప్రజల జీవనోపాధి అవకాశాలు పెంపొందేలా చూస్తామని తెలిపారు. ఎస్సీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలతో పాటు రెవెన్యూ, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ తదితర శాఖల్లో వివిధ హోదాల్లో పనిచేసిన తన అనుభవంతో జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామని అన్నారు. జిల్లాలో నెలకొన్న సమస్యలు, ఇబ్బందుల గురించి తెలుసుకుని కార్యాచరణ ప్రకారం వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

కలెక్టర్‌కు ఘన స్వాగతం...

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన సయ్యద్ ఒమర్ జలీల్‌కు వివిధ శాఖల జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. ఇన్‌చార్జి జేసీ సంధ్యారాణి, వికారాబాద్, తాండూరు ఆర్డీవోలు విశ్వనాథం, వేణుగోపాల్‌రావు, డీఆర్‌డీవో జాన్సన్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్‌లు పుష్పగుచ్చాలతో కలెక్టర్‌కు స్వాగతం చెప్పారు. డీఎంహెచ్‌వో డాక్టర్ దశరథ్, డీసీహెచ్ లలిత, డీసీఎస్‌వో పద్మజ, డీఎస్‌వో ప్రవీణ్‌కుమార్, సీపీవో దశరథ్, మైన్స్ ఏడీ సామ్యూల్ జాకబ్, పీఆర్‌ఈఈ మనోహర్ రావు, డీపీఆర్‌ఓ నర్సింహులు, డీసీవో హరిణి, బీసీడీవో పుష్పలత, డీవైఎస్‌వో హన్మంత్‌రావు తదితర శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న వివిధ ప్రభుత్వ కార్యక్రమాలపైన ఆయన ఇన్‌చార్జి జేసీ సంధ్యారాణిని అడిగి తెలుసుకున్నారు.

కాగా జిల్లా కలెక్టర్‌గా నియామకమైన సయ్యద్ ఒమర్ జలీల్ 1998 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. 2003 నుంచి 2007 వరకు మెదక్, వరంగల్ జిల్లాల్లో జాయింట్ కలెక్టర్‌గా సేవలు అందించిన ఆయన 2007 నుంచి 2008 వరకు నల్లగొండ జేసీగా విధులు నిర్వహించారు. ఆ తరువాత రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా 2010 వరకు సేవలు అందించారు. అనంతరం ఆయన 2013 వరకు బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు. అనంతరం ఏడాది పాటు సీసీఎల్‌ఏ కార్యదర్శిగా సేవలు అందించిన ఒమర్ జలీల్ ఆ తరువాత మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం సీసీఎల్‌ఏ కార్యదర్శిగా పనిచేసిన ఆయనకు ప్రభుత్వం మరోసారి మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించింది. ఇటీవల జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో ఉమర్ జలీల్‌ను జిల్లా కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. వికారాబాద్ జిల్లాకు ఆయన రెండవ కలెక్టర్ కాగా, ఆయనకు తొలిసారిగా జిల్లా కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు. అంతకు ముందు ఆయన మునిసిపల్ పరిపాలనా విభాగంలో కూడా విధులు నిర్వహించారు.

ఆగని ఇసుక దందా!

- ఒక బిల్లు... అనేక ట్రిప్పులు
- వేబిల్లు ఇసుక పేరుతో కృత్రిమ ఇసుక వ్యాపారం
- వ్యాపారుల సిండికేట్.... కొరత సృష్టించి అమ్మకాలు
- అధికారులు,దళారులకు మామూళ్లు..
- టన్ను ఇసుక రూ.1400ల నుంచి రూ.2000



పరిగి: పర్మిట్ల ముసుగులో ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇసుక అక్రమ దందాను అడ్డుకట్ట వేయాల్సిన అధికారులకు ముడుపులు అందుతుండడంతో వ్యాపారం సవ్యంగా కొనసాగుతోంది. ఒక బిల్లుపై లెక్కలేనన్ని ట్రిప్పులు అమ్ముతూ లక్షలు గడిస్తున్నారు. పర్మిట్ ఇసుక పేరుతో పరిగి కేంద్రంగా కృత్రిమ ఇసుక దందాకు కొందరు వ్యాపారులు తెరలేపారు. వాస్తవానికి పరిగి పరిసరాల్లో ఇసుక లభించే వాగులు లేవు. కానీ కృత్రిమ ఇసుక స్థావరాలు ఉండడం, దూర ప్రాంతాల నుంచి బిల్లుతో వచ్చే ఇసుక దందా కూడా పరిగి కేంద్రంగానే ఇసుక వ్యాపారాన్ని నడిపిస్తున్నారు. పరిగిప్రాంతానికి కరీంనగర్, సిద్దిపేట, పాలూము జిల్లా కోయిల్‌సాగర్, రంగారెడ్డిపల్లి వాగు, యాలాల ప్రాంతాల నుంచి బిల్లుల ద్వారా ఇసుక వస్తోంది. ఈ బిల్లుల పేరిట ఇక్కడే పెద్ద వ్యాపారమే జరుగుతున్నది. పరిగి మండలం రంగంపల్లి, ఇబ్రాహింపూర్, గడిసింగాపూర్, దోమ మండలం కిష్టాపూర్, బుద్లాపూర్, పోతిరెడ్డిపల్లి, దిర్సంపల్లి, బడెంపల్లి, దాదాపూర్ కులకచర్ల మండలం అంతారం, పుట్టపహాడ్, మరికల్, చాకల్‌పల్లి, అనంతసాగర్ గ్రామాల పరిధిలోని వాగులు, వాగులు లేని గ్రామాల్లో కృత్రిమ ఇసుకను తయారు చేసి ప్రతి రోజు ఇసుకను పట్టణాలకు తరలిస్తున్నారు. ఈ విధంగా ఇసుక లారీలు నిత్యం పరిగి, దోమ, కులకచర్లలలోని పభుత్వ కార్యాలయాల ముందు నుంచే తరలిపోతున్నాయి. కానీ సంబంధిత అధికారులు మాత్రం చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పరిగి, కులకచర్ల, దోమ మండలాల నుంచి ప్రతినిత్యం వంద వరకు ట్రాక్టర్లు, లారీల ద్వారా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారు.

ఒక బిల్లు.. అనేక ట్రిప్పులు.!

ఇసుక తరలింపుకు గోరంత అనుమతి తీసుకోని కొండంత తరలిస్తున్నారు. ఈ ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అధికారులకు, కొందరి దళారులకు కాసులు కురిపిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల భవనాలు, సీసీ రోడ్ల తదితర నిర్మాణం కోసం కావాల్సిన ఇసుకను కాంట్రాక్టర్లు తీసుకోచ్చుకునేందుకు స్థానిక తహసీల్దార్, ఇంజనీరింగ్ అధికారుల ద్వారా కాంట్రాక్టర్లకు అనుమతులు ఇస్తున్నారు. ఇరత ప్రాంతాల నుంచి బిల్లు ద్వారా తీసువచ్చే ఇసుక వచ్చే ఇసుక లారీ పేరిట పదింతలు అక్రమ వ్యాపారం చేస్తున్నారు. బిల్లుతో వచ్చిన ఒక లారీ ఇసుక రశీదులో పది నుంచి ఇరవై లారీల ఇసుకను దొడ్డిదారిన అమ్ముతున్నారు. రంగంపల్లి, ఇబ్రహింపూర్, గడిసింగాపూర్, కిష్టాపూర్, బుద్లాపూర్, పోతిరెడ్డిపల్లి, దిర్సంపల్లి, బడెంపల్లి, దాదాపూర్ అంతారం, పుట్టపహాడ్, మరికల్, చాకల్‌పల్లి, అనంతసాగర్ ప్రాంతాల్లో కృత్రిమ ఇసుకను పరిగికి తీసువచ్చి యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ వ్యాపారంలో కొందరు దళారీలు లక్షలు సంపాదిస్తున్నారు. పరిగిలో కాంట్రాక్టర్లు, ఇసుక వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి వ్యాపారం కొనసాగిస్తున్నారు. నాలుగు ట్రాక్టర్ల ఇసుక అనుమతి తీసుకుని 50 ట్రాక్టర్ల ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక దందా కొందరు పోలీస్ అధికారులు నేరుగా తలదూర్చుతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కొత్తగా ఎవరైనా బిల్లుతో ఇసుకను తరలించిన వివిధ కారణాలలతో జరిమానాలు విధించడం, కేసులు నమోదు చేయడంలాంటి పనులకు పోలీసులు పూనుకుంటున్నారు.

కొరత సృష్టించి...

ఇసుక వ్యాపారం చేసే కొంత మంది వ్యక్తులు సిండికేట్‌గా మారి ధరలను పెంచేస్తున్నారు. ఇళ్ళు, ఇతర నిర్మాణ పనులు చేపట్టే వారికి ఇసుక తీసుకురావడానికి ఇబ్బందికర పరిస్థితులను చూపించి రెట్లను పెంచుతోన్నారు. అవసరం, నాణ్యతను బట్టి పరిగిలో టన్ను ఇసుకకు రూ.1400ల నుంచి రూ.2000ల వరకు కూడా విక్రయిస్తున్నారు. ఇసుక తీసుకరావడం కష్టంగానే ఉందని భావిస్తున్న నిర్మాణదారులు ఎంత ధర చెప్పినా తప్పని పరిస్థితుల్లో కొనుగోళ్ళు చేస్తున్నారు. ముఖ్యంగా దోమ, కులకచర్ల, గండీడ్ ప్రాంతాల నుంచి తీసుకవచ్చే ఇసుక తెల్లవారుజాము నుంచి పరిగి మీదుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పరిగి శివార్లలో కూడా విక్రయాలు జరుగుతాయి. ఒక్కోసారి పరిగి నడిబోడ్డునే నిలిపి, కొంతఇక్కడ అమ్ముడుపోగా, మిగిలిన ఇసుకను పరిగి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ముఖ్యంగా ట్రాక్టర్లు లారీలు కలిపి వందకుపైగా తరలిపోతున్నాయి.

చేతులు మారుతున్న లక్షలు...

పరిగి ప్రాంతంలో ఇసుక మాఫియా ద్వారా కొందరు అధికారులకు లక్షల రూపాయాలు అందుతున్నాయన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇసుకమాఫిలో ప్రధానంగా పోలీస్, రెవెన్యూ అధికారులు భాగస్వాములవుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కొందరు పోలీస్ అధికారుల ఏజెంట్లు అయితే ఏకంగా ఇసుక లారీలు వచ్చే సయమానికి రహస్య ప్రాంతానికి వెళ్లి నేరుగా డబ్బులు వసూలు చేసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. రెగ్యులర్‌గా నడిచే వ్యాపారుల వద్ద ఒక్కో ట్రాక్టర్‌కు నెలకు రూ.10 నుంచి రూ.20 వేల వరకు మాముళ్ళ పెట్టుకున్నట్లు సమాచారం. రెగ్యులర్ వసూళ్ళు కాకుండా కొత్తగా వచ్చిన లారీలు, ట్రాక్టర్ల నుంచి దొరికినప్పుడల్లా వసూలు చేస్తోన్నారు.

నేడు తాండూరులో ముత్యాల ముగ్గుల పోటీ



(మొదటి పేజీ తరువాయి)

సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీలు మహిళల ఆదరణ పొందుతూ వస్తున్న విషయం తెలిసిందే. సంక్రాంతి ముగ్గుల ప్రాముఖ్యత, ప్రాధాన్యతను భావితరాలకు పరిచయం చేసేందుకు నిర్వహిస్తున్న ఈ ముగ్గుల పోటీలకు యువతులు, మహిళలు పాల్గొనవచ్చు.

పోటీలో పాటించాల్సిన నిబంధనలు..

మహిళలు మాత్రమే పాల్గొనే ఈ ముగ్గుల పోటీలో ముగ్గు, రంగులు, పువ్వులు ఇతర సామగ్రి పోటీలో పాల్గొంటున్న వారే తెచ్చుకోవాలి. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు చెప్పగలిగి ఉండాలి. ముగ్గు వేసేందుకు గరిష్ఠ సమయం రెండు గంటలు మాత్రమే. ముగ్గును చేతితోనే వేయాల్సి ఉంటుంది. గొట్టాలు, బద్దలు వంటివి ఉపయోగించకూడదు. జల్లెడ మాత్రం ఉపయోగించుకునే అవకాశం ఉంది. ముగ్గుల్లో గొబ్బెమ్మలను, బతుకమ్మలను అమర్చుకోవచ్చు. అవి తప్ప ఇతర వస్తువులను ఎక్కువగా అమర్చకూడదు. ముగ్గుకు అదనపు అందం ఇవ్వడానికి ఇతర వస్తువులు వాడాలే తప్ప ఆ వస్తువులనే ప్రధానాంశంగా చేసుకోకూడదు. ముగ్గుకు అదనంగా అలంకరణకు ఇతర వస్తువులు వాడినా.. ముగ్గుకే ప్రాధాన్యం ఇస్తారు. ఈ పోటీలో ప్రథమ బహుమతి సాధించిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఈనెల 12న హైదరాబాద్‌లో జరిగే ముగ్గుల పోటీకి హాజరు కావాల్సి ఉంటుంది. స్థానికంగా నిర్వహించే ఈ పోటీలో విజేతలైన వారికి పటేల్ రవిశంకర్ చారిటబుల్ ట్రస్ట్ తరపున జయశ్రీ చేతుల మీదుగా అందించడం జరుగుతోంది. గంగోత్రి పాఠశాల ఆవరణలో పాఠశాల యాజమాన్య ప్రతినిధి ఇందూరు రాములు ముగ్గుల పోటీల్లో పాల్గొనే వారికి కోసం తాగునీటి సౌకర్యం, తేనేటి విందును ఏర్పాటు చేస్తున్నారు. నగదు బహుమతులు అందజేయనున్నారు. ఈ పోటీలో పాల్గొన దలచిన మహిళలు, యువతులు, విద్యార్థులు 99854 11091, 80195 50122 నెంబర్లకు ఫోన్ చేసి తమ వివరాలను నమోదు చేసుకోవాలి. తమ వివరాలు నమోదు చేసుకోలేని వారు శనివారం నేరుగా ముగ్గుల పోటీ జరిగే స్థలానికి వచ్చి నమోదు చేసుకోవచ్చు.

-(తాండూరు)



మహేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వసంతకుమారి

జిల్లా పశు సంవర్ధక అధికారిగా వసంతకుమారి

(ఆంధ్రజ్యోతి, వికారాబాద్)

వికారాబాద్ జిల్లా పశు సంవర్ధక అధికారిగా వసంతకుమారి నియామకమయ్యారు. చేవెళ్ల డివిజన్ పశు సంవర్ధక శాఖ అధికారిగా పనిచేసిన ఆమె పదోన్నతిపైన వికారాబాద్ జిల్లా పశు సంవర్ధక అధికారిగా నియమితులయ్యారు. ఇంతకు ముందు ఇక్కడ పని చేసిన డాక్టర్ సుబ్బారావు బదిలీపైన షీప్ ఫెడరేషన్‌కు డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. కాగా, జిల్లా పశు సంవర్ధక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఆమె శుక్రవారం రాష్ట్ర రవాణా శాఖా మంత్రి డాక్టర్ మహేందర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలో పశు గణాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు సక్రమంగా అమలయ్యేలా కృషి చేయాలని సూచించారు.



ఎకో సెన్సిటీవ్ జోన్‌పై

జనాగ్రహం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి/ మెయినాబాద్)

చిల్కూరులోని జాతీయ మృగవని పార్కు చుట్టూ 5 కిలో మీటర్ల పరిధిలో ఎకో సెన్సిటీవ్ జోన్ ఏర్పాటు చేయా లని కేంద్ర అటవీ శాఖ నిర్ణయించడంపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'శివారు శరాఘాతం' శీర్షికతో ప్రచురిం చిన వార్త కథనం కలకలం రేకెత్తించింది. గుట్టుచప్పుడు కాకుండా కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ విడుదల చేసిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌పై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వ్యతి రేకిస్తున్నారు. దీన్ని ఉపసంహరించుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వీరంతా స్థానికంగా ఆందోళనలు చేపట్టేందుకు సిద్దమవుతు న్నారు. దీనిపై కొందరు నేతలు, స్థానికులు ఆవేదన, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని పలు పార్టీల నేతలు పేర్కొన్నారు.

గోరుచుట్టుపై రోకటి పోటు

- కార్తీక్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జ్



చిల్కూరులోని జాతీయ మృగ వని పార్కు చుట్టూ 5 కిలో మీటర్ల పరిధిలో ఎకో సెన్సిటీవ్ జోన్ ఏర్పాటు చేయాలని కేంద్రం తీసు కున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతి రేకిస్తున్నాం. 111 జీవో పేరు తో నగర శివార్లలోని పలు గ్రామాల్లో ఇప్పటికే ఆంక్షలు అమలుచేసి అభివృద్ధి చెందకుండా అడ్డుకుంటున్నారు. జీవోను సవరించాలని మేమంతా ఒకవైపు పోరాటం చేస్తుంటే మరోవైపు ప్రభు త్వాలు కొత్తగా ఎకో సెన్సిటీవ్ జోన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం దారు ణం. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని తుది నోటిఫికేషన్ రాకుండా అడ్డుకోవాలి. దీనిపై కాంగ్రెస్ తరుపున పోరాడతాం.

అభివృద్ధి కుంటుపడుతుంది

-గోపాల్‌రెడ్డి, బీజేపీ, మొయినాబాద్ మండల మాజీ అధ్యక్షుడు



జంట జలాశయాల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన జీవో 111 వల్ల ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నాం. తాజాగా కేంద్రం అటవీ శాఖ తీసుకుంటున్న నిర్ణయంతో గ్రామంలో అభివృద్ధి పూర్తిగా కుంటు పడుతుంది. కేంద్ర అటవీశాఖ ఈ నిర్ణ యాన్ని ఉపసంహరించుకోవాలి. కొత్త ఆంక్షలు విధిస్తే గ్రామాలు పూర్తిగా నాశనం అవుతాయి. ప్రజలు బ్రతకలేని పరిస్థితి ఏర్పడుతుంది.

గ్రామాలు నాశనమవుతాయి

-నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మొయినాబాద్ మండల అధ్యక్షుడు



హైదరాబాద్ నగరానికి చేరువలో ఉన్న గ్రామాలు ఇప్పటికే జీవో 111 వల్ల ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు. జీవో 111తో సతమతమవుతున్న ప్రజలపై కొత్త నిబంధనలు విధించేందుకు సన్నద్ధం కావడం మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు ఉంది. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాన్ని ఉపసంవరించుకునేల రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. ఇప్పటికే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే అవకాశాలు లేవు. యువత ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కొత్త నిబంధనలు విధిస్తే ఈ గ్రామాలు పూర్తిగా నాశనం అవుతాయి. ప్రభుత్వం ఈ నిర్ణ యాన్ని ఉప సంవరించుకోవాలి.

ఆందోళనలకు దిగుతాం

-షాబాద్ దర్శన్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు



ప్రజలపై లేనిపోని ఆంక్షలు విధిస్తే చూస్తూ ఊరుకునేదిలేదు. కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుంటూ ప్రజలు ఇబ్బందులకు గురి చేసేలా వ్యవహరిస్తుంది. కేంద్రం అటవీ శాఖ తీసుకుంటున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి. లేదంటే పెద్దఎత్తున ఉద్యమం చేస్తాం. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి మృగవని పార్కు చుట్టూ ఎకో సెన్సిటీవ్ జోన్ ఏర్రాటు కాకుండా చూడాలి. ఇప్పటికే వెనకబడిఉన్న గ్రామాలను మరింత పాతళంలోకి నెట్టొద్దు.

ఖాతాదారులు ఎక్కడ?

- గ్రామసభలకు మోస్తరుగా హాజరు
- ముగిసిన రెండో విడత సమావేశాలు
- జిల్లాలో ఖాతాదారులు మొత్తం 4,00,608
- హాజరైంది 1,68,004 మంది

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా రెండో విడత గ్రామ సభలు ముగిసాయి. అయితే ఈ సభలకు భూఖాతాదారులంతా హాజరై సంతకాలు చేయకపోవడంతో అభ్యంతరాలు తీసుకునేందుకు మరికొంత గడువు పెంచారు. గడువుతో సంబంధం లేకుండా ఈ పక్రియను ఇంకా కొన్నిరోజులు కొనసాగించాలని అధికారులు నిర్ణయించారు. పూర్తిస్థాయిలో ఖాతాదారులను కలిసి అభ్యంతరాలు ఉంటే తీసుకుని వారితో రికార్డుల్లో సంతకాలు చేయించడం ద్వారా ఈ పక్రియను పూర్తిచేయాలని భావిస్తున్నారు. రెండో విడత జిల్లాలో 602 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 4,00,608 ఖాతాదారులు ఉండగా రెండు విడతలుగా 168804 మంది హాజరై సంతకాలు చేశారు. మిగిలిన ఖాతాదారులు రాలేదు. ఇంత సంఖ్యలో గ్రామసభలకు ఖాతాదారులు హాజరుకావడం గొప్ప విషయమేనని అధికారులు అంటున్నారు. కొందరు రికార్డులు బాగానే ఉన్నాయనే ఉద్దేశంతో గ్రామసభలకు హాజరుకాలేదని చెబుతున్నారు. అయితే గ్రామసభలకు వచ్చి తమ ఖాతాలు, భూరికార్డులను పరిశీలించుకుని ఆమోదం తెలుపుతూ సంతకాలు చేసిన వారికి మాత్రం వెంటనే పట్టాదారు పాస్‌పుస్తకాలు అందచేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఖాతాదారుల సంతకాలు తీసుకుని ఆమోదం తీసుకుంటే కొత్తపట్టాదారు పాస్‌పుస్తకాల జారీకి ఎలాంటి ఆటంకం ఉండదని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా మొదటి విడత నిర్వహించిన గ్రామసభల్లో వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి వీటిలో చాలవరకు పరిష్కరించారు. రెండో విడత గత నెల 27 నుంచి 31వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి మొదటివిడత వచ్చిన ఫిర్యాదులు, పరిష్కార వివరాలను గ్రామస్థులకు వివరించారు. పరిష్కరించిన ఫిర్యాదులకు సంబంధించి దరఖాస్తుదారుల నుంచి సంతకాలు తీసుకున్నారు. అలాగే ఎలాంటి అభ్యంతరాలు లేవన్న ఖాతాదారుల నుంచి ఆమోద సంతకాలు తీసుకున్నారు. సవరించిన భూరికార్డుల్లో ఇందుకోసం ఒక ప్రత్యేక కాలమ్ పెట్టి ఖాతాదారుల సంతకాలు తీసుకున్నారు. ఇప్పటి వరకు రెండు విడతలుగా జరిగిన గ్రామసభలకు 1,68,004 మంది ఖాతాదారులు హాజరై సంతకాలు తీసుకున్నారు. రెండో విడతలో మొత్తం 4764 అభ్యంతరాలు వచ్చాయి. ఇందులో 353 మ్యుటేషన్లకు సంబంధించినవి రాగా వారసత్వం భూబదలాయింపుకు సంబంధించి 301, రికార్డుల్లో పేర్లు తప్పులపై 1554, భూవిస్తీర్ణంలో తప్పులకు సంబంధించి 1038, ఇతర వివరాలకు సంబంధించి 1533 అభ్యంతరాలు వచ్చాయి. మొత్తం 4764 అభ్యంతరాలు రాగా ఇందులో 3384 అభ్యంతరాలను పరిశీలించి వెంటనే రికార్డులను సవరించారు. ఇంకా 1287 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలా ఉంటే జిల్లాలో మొత్తం 4,00,608 మంది ఖాతాదారులు ఉండగా చేవెళ్ల డివిజన్‌లో 91,915 మంది ఖాతాదారులు ఉండగా వీరిలో 40,937 మంది సంతకాలు చేశారు. ఇబ్రహీంపట్నం డివిజన్‌లో 1,00,826 మంది ఖాతాదారులు ఉండగా వీరిలో 33653 మంది సంతకాలు చేశారు. కందుకూరు డివిజన్‌లో 90148 మంది ఖాతాదారులు ఉండగా వీరిలో 31,334 మంది గ్రామసభలకు వచ్చి సంతకాలు చేశారు. రాజేంద్రనగర్ డివిజన్‌లో 24,932 మంది ఖాతాదారులు ఉండగా 7025 మంది సంతకాలు చేశారు. షాద్‌నగర్ డివిజన్‌లో 92,787 మంది ఖాతాదారులు ఉండగా ఇందులో 55055 మంది సంతకాలు చేశారు.

ఇబ్రహీంపట్నంలో అధికం

జిల్లాలో మొత్తం 4764 అభ్యంతరాలు రాగా ఇందులో ఇబ్రహీంపట్నం డివిజన్‌లో 1943 అభ్యంతరాలు వచ్చాయి. ఇందులో 837 ఫిర్యాదులు పరిష్కరించారు. ఇంకా 1007 పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే షాద్ నగర్ డివిజన్‌లోనే 1020 అభ్యంతరాలు వచ్చాయి. ఇందులో 920 దరఖాస్తులు పరిష్కరించారు. ఇంకా 100 పెండింగ్‌లో ఉన్నాయి. చేవెళ్ల డివిజన్‌లో 996 అభ్యంతరాలు రాగా ఇందులో 883 పరిష్కరించారు. ఇంకా 113 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే కందుకూరు డివిజన్‌లో 525 రాగా వీటిలో 514 పరిష్కరించారు. ఇక్కడ కేవలం 11 ఫిర్యాదులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. రాజేంద్రనగర్ డివిజన్‌లో 280 ఫిర్యాదులు రాగా వీటిలో 230 పరిష్కరించారు. 56 పెండింగ్‌లో ఉన్నాయి.

మృగవనిలో సాంబార్ జింక(దుప్పి) మృతి

చనిపోయి మూడురోజులు అవుతున్నా గుర్తించని అటవీశాఖ

నార్సింగ్ : చిల్కూర్ మృగవని జింకల పార్కు. ఇది రిజర్వు ఫారెస్టు. పార్కు అభివృద్ధికి, రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక గెజిట్ తెచ్చిన విషయం తెలిసిందే. ఆ పార్కులో ఇప్పటికే 465 చుక్కల జింకలు, 80 సాంబర్ జింకలు, 300 నెమళ్లు 150 అడవి పందులు ఉన్నాయి. వన్యప్రాణులను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇందులో ప్రతి జీవి కదలికలను గమనించ వాటి ఆలపన పాలన చూడాల్సిన అవసరం ఉంది. ఇదంతా బాగానేఉన్నా పార్కులో సాంబార్ జింకా(దుప్పి) వేటకు గురైంది. మృత్యువాత పడి అలాగే ఉంది. దాదాపు మూడు రోజుల క్రితం ఈ దుప్పి చనిపోయి ఉంటుంది. పార్కులో ఉన్న అడవి పంది లేక ఇతర జంతులువులు ఏమైనా ఈ దుప్పిని చంచినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ దుప్పి మృతి చెందడంతో దుర్వాసన వస్తోంది. పార్కులో అప్పా రోడ్డులో జంబోరి స్థలానికి సమీపంలో దుప్పి మృతదేహం పడి ఉంది. మూడేళ్ల క్రితం ఒక జింకా ఇలాగే చనిపోయి అలాగే ఉండిన ఘటన జరిగింది. ఈసారి దుప్పి చనిపోతే పట్టించుకునే నాధుడు కరవయ్యారు. ప్రతిరోజు పార్కు చుట్టూ పహారా కాసే గార్డులు ఉన్నా, అటవీ సిబ్బంది ఉన్నా దుప్పి చనిపోయిన విషయాన్ని గమనించకపోవడం శోచనీయం. చనిపోయిన దుప్పిని పరిశీలిస్తే వెనుక భాగంలో కొరికినట్లు ఉంది. ఇది అడవి పందుల పని లేదా అడవి కుక్కలు లేదా నక్కల పని అయి ఉంటుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇక పార్కులో చిరుతుల ఉన్నట్లు అందరు అనుమానిస్తారు. అడపా దడపా ఈ పార్కు దరిదాపుల్లోనే అవి కనిపిస్తుంటాయి. అయితే చిరుత దాడి చేస్తే దుప్పి గొంతు కొరికేస్తుంది. కాని ఇక్కడ దుప్పి గొంతు బాగానే ఉంది. ఒక వేళ వేటగాళ్లు వేటాడి ఉంటే దాని ఎత్తుకెళతారు. అలా వదిలేసి వెళ్లరు. ఏది ఏమైనా అటవీ శాఖ సిబ్బంది మాత్రం చనిపోయిన దుప్పి చూడకపోవడం, తొలగించకపోవడం చూస్తుంటే వారి పర్యవేక్షణ ఎలా ఉందో అర్థం అవుతోంది. మరి ఓ పక్క కేంద్ర ప్రభుత్వం వాటికోసం ప్రత్యేక జీవోలు, గెజిట్‌లు తీసుకొస్తుంటే ఇక్కడ మాత్రం ఇలాంటి ఘోరాలు జరుగుతుండడం గమనించాల్సిన విషయం.

నిధులున్నా నిర్లక్ష్యమే..

- శ్మశానవాటికల నిర్మాణంపై అలత్వం
- అడుగు ముందుకు పడని పనులు
- ఉమ్మడి జిల్లాలో లక్ష్యం 576
- నిధులు మంజూరు 280

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

ఉమ్మడి జిల్లాలో అనేక గ్రామాల్లో కొన్ని వర్గాల వారికి శ్మశానవాటికలు లేవు. చనిపోయిన వారిని ఖననం చేసేందుకు స్థలాలు కరువు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో శ్మశాన వాటికలు లేని కారణంగా పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఉన్న శ్మశాన వాటికల్లో సౌకర్యాలు లేవు. దీన్ని దృష్టిలో పెట్టుకునే కేంద్రం జాతీయ ఉపాధి హామీపథకం కింద గ్రామానికి ఒకటి చొప్పున శ్మశాన వాటికలను మంజూరు చేయాలని భావించింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో ప్రభుత్వ భూములు ఉన్న చోట రెవెన్యూ అధికారులు స్థలాలను ఎంపిక చేశారు. స్థల ఎంపికతో అక్కడ ఉపాధిహామీ పథకం ద్వారా శ్మశాన వాటికలు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 576 శ్మశాన వాటికలు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇందులో 280 శ్మశాన వాటికల నిర్మాణానికి రూ. 28 కోట్ల నిధులు మంజూరు చేశారు. అయితే ఇప్పటి వరకు వీటిలో ఒక్కటి మాత్రమే పూర్తయింది. అది కూడా మంచాలలో పూర్తి చేశారు. ఇంకా 35 చోట్ల పనులు చేపట్టారు. ఇవి ఎన్నాళ్లకు పూర్తవుతాయో కూడా తెలియదు. ఇదిలా ఉంటే రంగారెడ్డిజిలాలో మొత్తం 415 శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టగా ఇందులో 138 మంజూరు చేశారు. ఒక్కో శ్మశాన వాటికకు రూ. 10లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. ఇలా జిల్లాకు రూ. 13.8 కోట్లు మంజూరయ్యాయి. అయితే ఆయాశాఖల మధ్య సమన్వయం లేక ఈ పనులు ముందుకు సాగడం లేదు, ఇప్పటి వరకు జిల్లాలో కేవలం ఒక్క శ్మశాన వాటిక మాత్రమే పూర్తి చేయడం గమనార్హం. ఇంకా 31 చోట్ల పనులు పురోగతిలో ఉన్నాయి. చాలా మండలాల్లో అరకొర పనులు మాత్రమే మొదలయ్యాయి. చేవెళ్ల, కందుకూరు, రాజేంద్రనగర్, షాబాద్, శంషాబాద్, శంకరపల్లి మండలాలు ఇంత వరకు ఒక్క చోట కూడా పనులు మొదలు పెట్టలేదు. ఇదిలా ఉంటే వికారాబాద్ జిల్లాలో 149 గ్రామాల్లో శ్మశాన వాటికలు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 133 మంజూరు చేశారు. ఇందులో ఒక్కటీ పూర్తి కాలేదు. కేవలం నాలుగు చోట్ల మాత్రమే పనులు చేపట్టారు. అలాగే మేడ్చల్ జిల్లాలో 12 నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 9 మంజూరు చేశారు,. ఇందులో ఒక్క చోట కూడా పనులు చేపట్టలేదు.

ఏఏ పనులు చేపడతారు?

ఈ నిధులతో ఆఫీసు రూమ్‌తో పాటు స్టోర్‌రూమ్ నిర్మిస్తారు. అలాగే మృతదేహాన్ని దహనం చేసేందుకు రెండు ప్లాంట్లు, దహన సంస్కారాలకు వచ్చిన వారి కోసం ఒక షెడ్ నిర్మాణం చేపడతారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా టాయ్‌లెట్స్ నిర్మాణం చేస్తారు. అలాగే ఒక రేజ్ ప్లాట్‌ఫాం, సింటెక్స్, సోలార్ లైటింగ్ ఏర్పాటు చేయాలి.

మృత్యువాత పడ్డారంటే అంత్యక్రియలకు రభసే..

ఇబ్రహీంపట్నం : 17 ఏళ్లుగా వారి శ్మశానవెతలు తీరడంలేదు. ఆ వర్గంలో ఎవరైనా మృత్యువాత పడ్డారంటే అంత్యక్రియలకోసం ఆ రోజంతా రభస జరగాల్సిందే. లేకుంటే అంత్యక్రియలు నిర్వహించలేని పరిస్థితి. మంచాల మండల పరిధి జాపాలలో వీరశైవుల శ్మశానవాటిక స్థలంపై సమస్యగా మారింది. జాపాలలో వీరశైవులు 20 కుటుంబాల వరకు ఉంటారు. ఈ వర్గంలో ఎవరైనా మరణస్తే వీరి పూర్వీకుల నుంచి మంచాల వెళ్లే దారి పక్కన అంత్యక్రియలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇది పట్టా భూమి కావడంతో తదనంతర కాలంలో భూముల రేట్లు పెరగడం, క్రయవిక్రయాలతో శ్మశానవాటిక ఉన్న ప్రదేశం చేతులు మారింది. ప్రస్తుత పట్టాదారు తన భూమిలో ఖననం వద్దంటూ పేచీ పెడుతున్నారు. దీంతో అంత్యక్రియల నిర్వహణ సమస్యగా మారుతూ వస్తోంది. 2002 నుంచి ఈ సమస్య మరింత జఠిలమై మృతదేహాల ఖననం తలనొప్పిగా తయారైంది. దీంతో గ్రామ పరిదిలో మరో ప్రభుత్వ స్థలంలో అంత్యక్రియలకోసం ప్రయత్నించినా సమీప వర్గాలనుంచి తీవ్రవ్యతిరేకత ఎదురైంది. ఇక చేసేదేమీ లేక ప్రతిసారీ అవరోధాలు ఎదుర్కొంటూ ఇదివరకటి శ్మశానవాటికలోనే అంత్యక్రియలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో వీరశైవులు సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వానికి పలు మార్లు విజ్ఞప్తులు చేస్తూవచ్చారు. వీరి సమస్యపై ఆర్డీవో కూడా క్షేత్రస్థాయి పరిశీలన జరిపి వెళ్లారు. దీంతో అప్పటి కలెక్టర్ శేషాద్రి స్పందిస్తూ నిర్దేశిత ప్రదేశంలో వీర శైవులకు శ్మశాన వాటిక స్థలం కేటాయించాలంటూ రెవెన్యూ యంత్రాంగానికి ఆదేశాలు పంపారు. కానీ ఇప్పటికీ వీరికి స్థల కేటాయింపు ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగడి అన్నచందంగా ఉంది.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

పెద్దేముల్: మండల కేంద్రంలో శుక్రవారం అయ్యప్ప పడిపూజను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన డీవై.నర్సిములు గృహంలో అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు. పూజకు అయ్యప్ప స్వాములు పెద్దఎత్తున తరలివచ్చారు. జడ్పీ ఛైర్‌పర్సన్ సునితారెడ్డి హాజరై స్వామివారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ నారాయణరెడ్డి, పలువురు పాల్గొన్నారు.



రబీపై రైతన్న ఆశలు

- బోరు బావుల ఆధారంగా పంటల సాగుకు సన్నాహాలు
- ఖరీఫ్ కష్టాలను గట్టెక్కించేందుకు రైతుల ప్రయత్నాలు

తాండూరు రూరల్: రబీ సాగుకు రైతన్నలు సిద్ధమయ్యారు. ఖరీఫ్ సీజన్‌లో నష్టాలు గట్టెక్కించేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. ఈలోగా రబీ సీజన్ పంటల సాగుపై దృష్టి సారించారు. గత వర్షాకాలంలో నిండిన చెరువులు, కుంటలు బోరు బావుల ఆధారంగా పంటసాగుపై రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. బోరు బావుల కింద వరి, వేరుశనగ, కూరగాయల సాగుపై శ్రీకారం చుట్టారు. ఇప్పటికే వేరుశనగ విత్తుకున్నప్పటికీ బోరుబావుల కింద వరినార్లను వేసుకునేందుకు నారుమళ్లను రైతులు సిద్ధం చేసి వరిమళ్లను చదును చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. తాండూరు మండల పరిధిలో ఇప్పటి వరకు శనగ, వేరుశనగ, వరి పంట సాగుపై దృష్టి సారించారు. రైతులకు ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యుత్ కూడా 24 గంటలు అందిస్తుండటంతో రైతులు బోరుబావుల కింద వరిపంట సాగుకు సన్నద్ధమయ్యారు. తాండూరు మండల పరిధిలోని 42 చెరువులు, 250 బోరుబావులు, అల్లాపూర్ శ్రీరాముల వారి ప్రాజెక్టు, జినుగుర్తి ప్రాజెక్టు, ఐలోని చెరువు, చెంగోల్ ఊర చెరువులు, పెద్ద చెరువు, రాంపూర్ చెరువు, నారాయణపూర్ ఊర చెరువులతోపాటు బెల్కటూర్, చింతామణిపట్నం, పర్వతాపూర్, ఉద్దండాపూర్, సంకిరెడ్డిపల్లి, ఐనెల్లి, సిరిగిరిపేట్, వీరారెడ్డిపల్లి, రాంపూర్, రాంపూర్‌తండా, అల్లాపూర్ తదితర ప్రాంతాల్లోని నల్లరేగడి భూముల్లో బోరుబావుల కింద రైతులు రబీలో వరి పంట సాగుకు పొలాలు సిద్ధం చేసుకుంటున్నారు. గత ఖరీఫ్‌లో వేసిన వరి పంట సుడి దోమతో, కంది ఎండు తెగులుతో నష్టపోయింది. ఈ రబీలో అయినా తమ నష్టాన్ని పూడ్చుకునే ప్రయత్నంలో భాగంగా రైతులు రబీ పంటలపై ఆసక్తి కనబరుస్తున్నారు.


వరి నారు వేసేందుకు పొలం సిద్ధం చేస్తున్న రైతు

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ

తాండూరు: జాతీయ భావనను విద్యార్థుల్లో పెంపొందించాలని, దేశ నిర్మాణంలో పాల్పంచుకునే విధంగా ప్రోత్సహించాలని డీఎస్పీ రాంచంద్రుడు కోరారు. శుక్రవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తాండూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల కాలమానిని, డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పటేల్ విజయ్‌కుమార్, ఆపస్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆనంద్, కోశాధికారి జనార్దన్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రావు, నరహరిరెడ్డి, మహేష్, చంద్రశేఖర్, షఫీ, లక్ష్మారెడ్డి, జి.రాజేష్, మాణిక్‌రావు, శ్రీనివాస్, ప్రభాకర్, హన్మప్ప, గోపాల్‌తోపాటు నాయకులు కృష్ణ, బాలి శివకుమార్ పాల్గొన్నారు.

తాండూరు డిపో ఎదుట గేటు ధర్నా


డిపో ఎదుట గేటు ధర్నా చేస్తున్న టీఎంయూ నాయకులు

తాండూరు: తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం తాండూరు ఆర్టీసీ డిపో ఎదుట గేటు ధర్నాను నిర్వహించారు. రాజ్యసభలో ఉన్న వాహన బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రధాన డిమాండ్‌తోపాటు ఏప్రిల్ నుంచి జరగాల్సిన జీత భత్యాల వసరణ వెంటనే జరగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు శేఖర్, కార్యదర్శి గోపాల్‌రెడ్డి, వర్కింగ్ అధ్యక్షుడు అంజిలయ్య, సహ కార్యదర్శి లక్ష్మీ, గ్యారేజీ కార్యదర్శి బసంత్‌రెడ్డి, యశ్వంత్, సత్తయ్య, సునిత, సులోచన తదితరులు పాల్గొన్నారు.

8న తాండూరుకు స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం రాక

- మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు

తాండూరు: ఈనెల 8న తాండూరు మున్సిపల్ కార్యాలయానికి కేంద్ర స్వచ్ఛ సర్వేక్షణ్‌పై పరిశీలన బృందం రానుందని మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పట్టణ పరిధిలోని అన్ని వార్డుల్లో మున్సిపాలిటీలో చేపట్టే కార్యక్రమాలపై స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా సర్వే నిర్వహించనున్నట్టు తెలిపారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, తడి, పొడి చెత్త ఏ విధంగా సేకరిస్తున్నారు, ఎక్కడ డంప్ చేస్తున్నారు, పట్టణంలోని ఇళ్లల్లో మరుగుదొడ్లు ఉన్నాయా లేదా? బహిరంగ మల విసర్జనకు వెళుతున్నారా అనే విషయాలపై సమగ్రంగా పరిశీలించనున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్యంపై మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు తదితర విషయాలపై సమగ్ర వివరాలను సేకరించి మున్సిపాలిటీకి గ్రేడింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు పట్టణానికి 2,141 మరుగుదొడ్లు మంజూరయ్యాయని, వీటిలో 1,242 మంది మరుగుదొడ్ల కోసం దరఖాస్తు చేసుకోగా, 1,120 మంది లబ్ధిదారులు మరుగుదొడ్లు నిర్మించుకున్నారన్నారు. 21 వార్డుల్లో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేసుకుని ఓడీఎఫ్ కింద టార్గెట్ పూర్తి చేశారని, 17వ వార్డులో మరో 14 మరుగుదొడ్లు నిర్మిస్తే ఓడీఎఫ్‌కు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. పట్టణంలోని ప్రజలు మున్సిపల్ సమస్యలు ఏమైనా ఉంటే స్వచ్ఛత యాప్ కింద సమస్య వివరించి ఫొటోలు పంపిస్తే పరిష్కరించనున్నట్టు తెలిపారు.


భోగేశ్వర్లు

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన రమేశ్


పరామర్శిస్తున్న రమేశ్, తదితరులు

బషీరాబాద్: గుండెపోటుతో మృతి చెందిన వికారాబాద్ జిల్లా సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్ కుటుంబాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.రమేష్ శుక్రవారం పరామర్శించారు. బషీరాబాద్‌లోని ఇంటికి వచ్చిన ఆయన మృతుని భార్య, కుమారులతో చర్చించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభుతి తెలిపారు. ఆయన వెంట ఎంపీటీసీ నరేష్‌చౌహాన్, నవాంద్గి పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ ఆర్.రామునాయక్, మోహన్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీసీఐ టౌన్‌షిప్‌లో ఉచిత యోగ


యోగ చేస్తున్న దృశ్యం

తాండూరు రూరల్: సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ టౌన్‌షిప్‌లో ఉచిత యోగ, డయాబెటిక్ డైట్ శిబిరాన్ని శుక్రవారం పతాంజలి యోగ శిక్షకుడు పి.శివశంకర్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఉదయం 5.45 గంటల నుంచి 6.45 వరకు నిర్వహించనున్నట్లు యోగ శిక్షకులు తెలిపారు. డయాబెటిక్ డైట్ ద్వారా షుగర్‌ను నియంత్రించుకోవచ్చన్నారు. రెండు రోజులపాటు డయాబెటిక్ డైట్ ను ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

నిందితుడిపై చర్యలు తీసుకోవాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

తాండూరు రూరల్: కామారెడ్డి జిల్లాలో వీఆర్‌ఏ బోయిని సాయిపై ఇసుక వ్యాపారులు అర్ధరాత్రి ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ధనంజయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. సాయి కుటుంబానికి రూ.10లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు వెంకటేష్, అరుణ్‌రాజ్, వీఆర్‌ఏ తాండూరు మండల కమిటీ ప్రతినిధి పి.చంద్రప్ప, నర్సింహులు తదితరులున్నారు.

వీఆర్‌ఏల ఆందోళన..

బషీరాబాద్: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కారేగాల్ శివార్లలోని కాకి వాగు వద్ద టిప్పర్ ఢీకొని వీఆర్‌ఏ బోయిని సాయి మృతిచెందడంతో మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు అనంతయ్య ఆధ్వర్యంలో వీఆర్‌ఏలు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన వ్యక్తం చేశారు. వీఆర్‌ఏలకు ఇసుక మాఫియా వల్ల ఎక్కడ కూడా రక్షణ లేకుండా పోయిందని వీఆర్‌ఏ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ రాజీవ్‌రెడ్డికి వీఆర్‌ఏలు వినతి పత్రం అందజేశారు.

క్యామ మల్లేశ్ జన్మదిన వేడుకలు



తాండూరు: కాంగ్రెస్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు క్యామ మల్లేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నహీం పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులున్నారు.

రేపు రెడ్డి జాగృతి విస్తృత స్థాయి సమావేశం

బషీరాబాద్: హైదరాబాద్ రోడ్డు మార్గంలోని గురుదేవ్ గురుకుల్ పాఠశాలలో ఆదివారం జరిగే రెడ్డి జాగృతి నియోజక వర్గ కమిటీ విస్తృత స్థాయి సమావేశానికి రెడ్డి బంధువులు తరలిరావాలని వికారాబాద్ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు కె.భూపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి రెడ్డిలు హాజరు కావాలని కోరారు.

మైదానంలో ట్రాక్ ఏర్పాట్లు

తాండూరు: ఏబీవీపీ ఆధ్వర్యంలో 6, 7వ తేదీల్లో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్, వాలీబాల్ పోటీలకు సంబంధించి శుక్రవారం తాండూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పోటీలకు సంబంధించి ట్రాక్స్ కోట్ ఏర్పాట్లను పీఈటీలు కేశవరెడ్డి ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. పటేల్ రవిశంకర్ చారిటేబుల్ ట్రస్ట్ సౌజన్యంతో యువజన ఉత్సవాల పేరిట జరుగుతున్న పోటీలకు సంబంధించి ఏబీవీపీ భాగ్ ప్రముఖ్ లక్ష్మీకాంత్‌రెడ్డి, కార్యకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ట్రాక్స్ కోట్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

బీమాతో.. ధీమా

ఖరీఫ్‌లో బీమా చేసుకోక నష్టపోయిన వరి రైతులు

రబీలోనైనా చేయించుకోవాలంటున్న అధికారులు

ఆసక్తి చూపని అన్నదాతలు



పంటలను పరిశీలిస్తున్న ఏఈవో సంజూరాథోడ్



భోజనం చేస్తున్న విద్యార్థులు

ధారూరు: పంటల బీమా చేయించుకుంటేనే నష్ట పోయిన పంటలకు పరిహారం అందుతుందని, బీమా చేయించుకోని పంటలు నష్టపోతే రైతులకు పరిహారం రాదని వ్యవసాయ అధికారులు వివరిస్తున్నారు. రబీ పంటలకు అకాల వర్షాలు, గాలులు, వడగండ్ల వానల వల్ల ముప్పు ఉన్నందున రైతులు పంటల బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని అధికారులు వివరిస్తున్నారు. గత ఖరీఫ్‌లో చేతికి వచ్చిన వరి పంటకు సుడి దోమ ఆశించి తీవ్రంగా పంట దెబ్బతిని రైతులు నష్టపో యిన విషయాన్ని వారు రైతులకు గుర్తు చేస్తున్నారు.రబీలోనైన రైతులు పంటలకు బీమా చేయించుకోవాలని క్షేత్రస్థాయిలో ఎఈవోలు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రబీలో వరి, వేరుశనగ, జొన్న, ఉల్లిగడ్డ పంటలకు ఈనెల 31వ తేదీవరకు బీమా చేయించుకునే అవకాశం ఉంది. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటల బీమా చేయించుకోవచ్చు.

బీమా ప్రీమియం.. పరిహారం

రబీలో వరి పంటకు గ్రామం యూనిట్‌గా తీసుకున్నారు. వరికి ఎకరాకు 435.20 రూపాయలు బీమా ప్రీమియం చెల్లించాలి. పంట నష్టం జరిగితే హెక్టారుకు 72,500 పరిహారం అందు తుంది. వేరుశనగ పంటకు ఎకరాకు 300 రూపా యలు ప్రీమియం చెల్లించాలి. పంట నష్టపరి హారం హెక్టార్‌కు 50 వేల రూపాయలు మంజూరవుతుంది. జొన్నకు ఎకరాకు 165.20 రూపా యలు బీమా ప్రీమి యం చెల్లించాలి. పంట నష్టపోతే హెక్టారుకు 27,500 రూపాయలు పరిహారం అందుతుంది. ఉల్లిగడ్డకు ఎకరా కు 900 రూపాయలు ప్రీమియం చెల్లిస్తే పంట నష్టపోతే హెక్టారుకు రూ. 45,000 పరిహారం అందుతుంది. వర్షాలు పడకపోవటం, కరువు, చీడపీడలు, తెగుల్లు ఆశించటం, నూర్పిడి తర్వాత అకాల వర్షాల వల్ల పంట మునిగిపోవటం వంటి సందర్భాల్లో పంటలు నష్టపోతే రైతులకు నష్ట పరిహారం అందుతుంది.

ఆసక్తి చూపని రైతులు

రబీలో పంటల బీమా చేయించుకునేందుకు రైతులు ఆసక్తి చూపటం లేదు. ఇంతవరకు పైన పేర్కొన్న పంటలకు బీమా చేయంచుకునేందుకు రైతులు ముందుకు రాలేదు. గడువు ముంచుకు వస్తున్నా రైతుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనపడటం లేదని వ్యవసాయ అధికారులు అంటున్నారు.

తప్పనిసరిగా బీమా చేయించుకోవాలి



రబీలో రైతులు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలి. ఈ పంటలకు అకాల వర్షాలు, వడగండ్ల వానలు, గాలుల గండం ఉంటుంది, నిర్ణీత బీమా ప్రీమియంను గడువులోగా చెల్లించి బీమా చేయించుకుంటే పంటలు నష్టపోతే రైతులకు పరిహారం అందుతుంది. బ్యాంకులు, సహకార సంఘాలలో రుణాలు పొందిన రైతులు అక్కడే పంటలకు బీమా చేయించుకోవాలి. ఏపంట సాగు చేస్తే ఆపంటకే బీమా చేయించుకోవాలి. రుణాలు తీసుకోని రైతులు కూడా నేరుగా ప్రీమియం చెల్లించవచ్చని, సందేహాలుంటే రైతులు వ్యవసాయాధికారులను, లేదా టోల్‌ఫ్రీ నంబర్ 1-800-209-5858ను సంప్రదించాలి.

- సంజూ రాథోడ్, ధారూరు ఏఈవో.

ఆరోగ్యం.. మన చేతుల్లోనే

మురికి చేతులతోనే భోజనం చేస్తున్న విద్యార్థులు

చిన్నారుల ఆరోగ్యంపై అధికారుల నిర్లక్ష్యం



ప్లేట్లలో నీళ్లు పట్టుకుంటున్న విద్యార్థులు

చేవెళ్ల : పాఠశాలల్లో ప్రవేశపెట్టిన చేతుల పరిశుభ్రత కార్యక్రమం అమలు నామమాత్రంగా మారింది. మన ఆరోగ్యం మన చేతుల్లో ఉందని.. పరిశుభ్రత గురించి పాఠాలు బోధించే ఉపాధ్యాయులే దీన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడు క్కోవడంపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలో విద్య, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విఫలమవుతున్నారు. పాఠశాలల్లో సబ్బులు ఏర్పాటు చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించడం లేదన్న ఆరోపనలు వినిపిస్తున్నాయి.

అమలు మాటల్లోనే..

చేవెళ్ల నియోజకవర్గంలోని 90 శాతం పాఠశాలల్లో సబ్బుల జడలేదు. ఇందులో దాదాపుగా 20 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలకు వచ్చే సమయం నుంచి మధ్యాహ్నం భోజనం వరకు వివిధ రకాల వస్తువులను పట్టుకోవడం, మట్టిలో ఆడుకోవడం, తుమ్మడం, దగ్గడం, చేస్తుంటారు. ఇలాంటి సందర్భంలో చేతులను సబ్బుతో కడిగేలా చేయటమే కార్యక్రమం లక్ష్యం. ఈకార్యక్రమ అమలు మాత్రం మాటల వరకే పరిమితమైంది.

పట్టించుకునేదెవరు..?

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాల్లో 20 వేలమంది విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికీ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. అయితే విద్యార్థులు భోజనం చేసే ముందు చేతులు శుభ్రం చేసుకునే సమయంలో ఉపాధ్యాయులు దృష్టి సారించకపోవడంతో చేతులు శుభ్రం చేసుకోకుండానే భోజనం చేస్తున్నారు. ఇటీవల చేతుల శుభ్రతపై ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ చేపట్టినా ఫలితం లేకుండాపోయింది.

పొంచి ఉన్న ప్రమాదం..

అనారోగ్యంతో మృతి చెందుతున్న పిల్లల్లో ఎక్కువ మంది కేవలం శ్వాస సంబంధిత వ్యాధులు, నీళ్ల విరేచనాలే కారణమని వైద్యులు పేర్కొంటున్నారు. వ్యాధుల భారిన పడటానికి చేతులను పరిశుభ్రంగా ఉంచుకోకపోవటమేనని అంటున్నారు. కలుషితమైన నీరు, ఆహారం ద్వారా పచ్చకామెర్లు, కలరా, డయేరియా వ్యాధులు వస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు.

ఆ నిధులు ఏమవుతున్నట్లు..

విద్యార్థులకు పరిశుభ్రత నిమిత్తం సర్వశిక్షా అభియాన్ ద్వారా ప్రాథమిక పాఠశాలలకు రూ. 5 వేలు, ఉన్నత పాఠశాలలకు రూ. 10 వేలు చొప్పున కేటాయిస్తున్నారు. ఈ నిధులతో విద్యార్థుల చేతుల పరిశుభ్రతకు సబ్బులు, బకెట్, మగ్గులు, చేతులు తుడుచుకునేందుకు వస్త్రాలు కొనుగోలు చేసి అందుబాటులో ఉంచాలి. కానీ ఏపాఠశాలలో దీనిపై దృష్టి సారించిన దాఖాలాలు లేవు.

అన్ని పాఠశాలల్లో శుభత్ర పాటించాలి



విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో చేతులు కడుక్కునే విధంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు చూడాలి. ఇది అన్ని పాఠశాలల్లో పాటించాలి. విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి. పరిశుభ్రత పథకం అమలుపై ఎక్కడైన నిర్లక్ష్యం వహిస్తే వారిపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం.

- సుజాత, చేవెళ్ల ఎంఈవో

కానరాని 'రైతుబంధు'

అవగాహన కల్పించని అధికారులు

ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



మర్పల్లి వ్యవసాయ కార్యాలయం

మర్పల్లి : వ్యవసాయ మార్కెట్‌లో పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు మార్కెట్‌కు వచ్చే రైతులు ప్రమాదాల భారిన పడితే ఆదుకునేందుకు ప్రభుత్వం 'రైతుబంధు' పథకాన్ని ప్రవేశ పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ఆత్మబంధువుగా అభివర్ణిస్తోంది. ఈ పథకం వల్ల కలిగే లాభాల పట్ల రైతులకు అవగాహన లేక పోవడంతో ఈ పథకాన్ని ఏఒక్కరూ సద్వినియోగం చేసుకోవడం లేదు. కనీసం మండలంలో ఒక్క రైతుకు కూడా వ్యవసాయాధికారులు రైతుబంధు కార్డులు ఇప్పటి వరకు అందజేయ లేదు.పంటను మార్కెట్‌కు తరలించే తరుణంలో రైతులు ప్రమాదాలకు గురవుతున్నా.. ఒక్క రైతును కూడా ఈ పథకం కింద ఆదుకున్న దాఖలాలు లేవు.

పథకంవల్ల కలిగే లాభాలు

మార్కెట్‌లో ధర తక్కువగా ఉన్నప్పుడు ఆ పంటను అమ్ముకొని నష్టపోకుండా కొంత కాలం రైతులు మార్కెట్ గోదాంలో నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. గోదాంలో పంటను నిల్వ చేసుకున్న తరువాత పంట అంచనాను బట్టి 70 శాతం రైతులకు రుణాలు ఇవ్వాల్సి ఉంటుంది. నిల్వ ఉంచిన పంటకు పూర్తిగా భద్రతతో పాటు బీమా సౌకర్యం ఉంటుంది. పంట 180 రోజులు (ఆరునెలలు) నిల్వ ఉంచుకోవచ్చు. అప్పటికైనా సరైన ధర రాక పోతే రైతులు అభ్యర్థన మేరకు 270 రోజుల వరకు పంట నిల్వ చేసుకునే సౌకర్యం ఉంటుంది. ఈ పంట ద్వారా తీసుకునే రుణాలకు మొత్తం ఆరు నెలల వరకు ఎలాంటి వడ్డీ తీసుకోరు. 181 నుంచి 270 రోజుల వరకు తీసుకున్న రుణంపై 12శాతం వడ్డీ వర్తిస్తుంది.

బీమా పథకం..

రైతుల శ్రేయస్సుకోసం రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ యార్డులకు వచ్చే రైతులకు లైసెన్సు పొందిన హమాలీలకు బీమా పథకం ప్రైవేశపెట్టింది. మార్కెట్ యార్డుకు రైతు తమ పంటను విక్రయించేం దుకు వచ్చే సంఘటనలో ప్రమాదం జరిగితే ఈ బీమా మార్కెట్ కమిటీ ద్వారా చెల్లిస్తారు. ఈ బీమా సౌకర్యం 18 నుంచి 60సంవత్సరాల వయస్సు గల వారికి వర్తిస్తుంది. రైతు ప్రమాదవశాత్తు మరణిస్తే లక్ష రూపాయల వరకు శాశ్వతంగా వైకల్యం కలిగితే రూ. 75 వేలు, పాకిక్షంగా ఉంటే రూ. 25 వేలు మార్కెట్ యార్డు అందజేస్తుంది. కాని రైతులకు ఇలాంటి పథకం ఉందని తెలియకపోవడంతో ఈ పథకాన్ని పూర్తిగా వినియోగించుకోలేక పోతున్నారు. పంటలు చేతికి వచ్చే సమయంలో రైతులకు గ్రామాల వారిగా రైతుబంధు పథకం గురించి అవగాహన కల్పించాల్సి ఉన్నప్పటికీ ఒక్క గ్రామంలో కూడా ఈ పథకంపై అవగాహన కల్పించిన దాఖాలాలు లేవు. రైతులు ఎలాంటి పంటలు వేస్తున్నారు. ఆ పంటను ఎక్కడ, ఎంత ధరకు విక్రయిస్తున్నారో అధికారులు పట్టించుకోక పోవడంతో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తక్ పట్టీలు కావాలని ప్రశ్నిస్తే రేపు.. మాపు.. అంటూ దాటవేస్తున్నారు. ఇప్పటికైనా రైతు బంధు పథకంపై అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.


మేడిపల్లిలో శిథిలమై కూలుతున్న శశిభూషణ్‌రావు భవనం


గుప్త నిధులకోసం తవ్వకాలు


కంప చెట్లతో నిండిన భవనం

ఒకప్పుడు శశిభూషన్‌రావు భవనం నుంచే సాగిన ఏకఛత్రాధిపత్యం

నేడు శిథిలమై గుప్తనిధి కోసం తవ్వకాలకు అడ్డగా మారిన వైనం

ఇప్పటికి 20 సార్లు నిధికోసం తవ్వకాలు జరిపిన దుండగులు

నాడు రాజసం.. నేడు శిథిలం

యాచారం : ఒకనాడు మేడిపల్లి గ్రామంలో రాజభోగంతో అలరారిన భవనం నుంచి గ్రామపాలన సాగింది. నాడు దొర బయటకెలితే ముందు 15మంది, వెనకాల 15 మంది కాపలాదారులు పాదయాత్ర చేసి ఆయనను కంటికి రెప్పలా కాపాడేవారు. నాడు రాజభోగంతో ఉన్న భవనం నేడు శిథిలమై గుప్తనిధుల కోసం తవ్వకాలకు అడ్డగా మారింది. ఇప్పటికి 20 సార్లు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగాయి. ఎవ్వరికి ఎంత నిధి దొరికిందో తెలియని పరిస్థితి. ఇందులో గతంలో ప్రైవేటు పాఠశాల నడిపిన వ్యక్తి ఒకరు గుప్త నిధి కోసం తవ్వుతుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. అతనికి భారీగా నిధి లభించిందని గ్రామస్తులు తెలిపారు. గతంలో ఈభవనంలో పాఠశాల నడిపిన వ్యక్తి నేడు ఆంధ్రప్రాంతానికి వెళ్లిపోయారు. గ్రామస్తులను నమ్మించి గుప్త నిధి దోచుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మేడిపల్లి గ్రామంలో కర్ణం దొర శశిభూషణ్‌రావు తండ్రి, తాతలు చెప్పిందే వేదం. వారు మేడిపల్లి గ్రామాన్ని 1945 నుంచి 1975 వరకు పాలించారు. పట్వారి, పటేల్ గిరీలు వీరి ఆధీనంలోనే ఉండేవి. వీరికి గ్రామంలో వందలాది ఎకరాల సాగు భూములుండేవి. నేటికి శషిభూషణ్‌రావు కుటుంబీకులకున్న భూముల రికార్డులు ఇదే బంగ్లాలో చెదలు పట్టిపోతున్నాయి. ఉర్దులో రాసి ఉన్న రికార్డులను బట్టలో కట్టి దాచగా నేడు కిటికి తలుపులు విరిగి మట్టి పడి చెదలు పట్టిపోతున్నాయి. వీరి భూములకు సంబందించిన రికార్డులతో పాటు మేడిపల్లి గ్రామ రికార్డులు 1950 కాలం నాటి రెవెన్యూ రికార్డులున్నట్లు గ్రామస్తులు విశ్వసిస్తున్నారు. రికార్డులుండే గదిలోకి ఒంటరిగా వెళ్లాలంటేనే యువకులు భయపడుతున్నారు. దేవుని గుడి పక్క గదిలో వీరి కుటుంబానికి సంబందించిన రికార్డులున్నాయి. ఇంట్లో 50 గజాల లోతైన చేదబావి ఉంది. బావి మధ్యబాగంలో ఇనుప కమ్మీలున్నాయి. ఇందులో కూడా శషిభూషణ్‌రావు కుటుంబీకులు భారీగా బంగారు, వెండి ఆభరణాలు వేశారని గ్రామస్తులు చెబుతున్నారు. నేడు శిథిలంకాని భవనం పైకప్పులో గబ్బిలాలున్నాయి. నాడు వీరి ఇంటి ముందు చెప్పులు వేసుకొని వెళితే కర్ణం దొర చెప్పులు ధరించిన వారిని కొట్టేవారని గ్రామస్తులు చెప్పారు. వీరు ఒకనాడు జనం చేత వెట్టి చేయించుకున్నారని తెలిసింది. వారు గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి చాలా వరకు వీరి భూములన్నీ అమ్ముకున్నారు. యాచారం నుంచి మేడిపల్లి వరకు రహదారి కోసం యాచారంలో ఒకరోజు రోడ్డు శుభ్రపరిచి గ్రామానికి రోడ్డు వేయడం కోసం యాచారం వాసుల నుంచి అనుమతి పొందినట్లు గ్రామస్తులు తెలిపారు. నాడు పేద్దరికంలో ఉన్న దొరల కుటుంబీకులు నేడు అరకొరగా ఉన్న భూములను ఇతర రైతులకు కౌలుకు ఇచ్చి బతుకుతున్నారు. నాడు వారి ముందు ఎదురు మాట్లాడేందుకు సాహసించే వారు లేరని పలువురు గ్రామస్తులు తెలిపారు. శషిభూషణ్‌రావు కుటుంబీకులు నేడు ఇతర దేశాలలో ఉంటున్నారు. వారు ఇక్కడ ఉన్నప్పుడు బంగారు నగలు, వెండి ఆభరణాలు, నిజాం కాలం నాటి డబ్బుల నాణాలు భూమిలో పాతారని నేడు మేడిపల్లిలో జనం చెప్పుకుంటున్నారు. శషిభూషణ్‌రావు కుటుంబీకులు గ్రామం విడిచి వెళ్లినప్పటి నుంచి తరచూ కొంత మంది యువకులు, మంత్రగాళ్ల అండతో ఆభవనంలో గుప్త నిధి కోసం ఇప్పటికీ కనీసం 20 సార్లు తవ్వినట్లు గ్రామస్తులు ఆంధ్రజ్యోతితో చెప్పారు. రెండంతస్తుల భవనం నేడు వానలకు కూలి శిథిలమైంది. ఇంటి కిటికీలను కూడా తవ్వి నిధి కాజేశారని గ్రామస్తులు తెలిపారు. నాడు రాచఠీవితో పాలన సాగించిన ఇల్లు నేడు కూలిపోయింది. భవనంలోపల పలు గదుల తలుపులు, కిటికీలు గుప్తనిధి కోసం వచ్చిన దుండగులు విరగొట్టారు. నేడు గబ్బిలాలతో కిటకిటలాడుతుంది. ఇక ఈ భవనంలో పట్టపగలే సంఘ వ్యతిరేక కార్యకలాపాలు సాగుతున్న ఆనవాళ్లున్నాయి. తాగుబోతులు కూడా యువతులతో జల్సాలు చేసిన ఆనవాళ్లున్నాయి. పలు గదులలో మూడు నాలుగు గజాల లోతు గుంతలు తవ్వి మట్టితో మూసిన ఆనవాళ్లున్నాయి. ఈ శిథిల భవనంలో లక్షలాది రూపాయల విలువైన గుప్త నిధి ఉందని గ్రామస్తులు ప్రగాడంగా నమ్ముతున్నారు. గురువారం ఇదే భవనంలో గుప్త నిధి తవ్వడం కోసం వచ్చిన దుండగులు అడ్డంగా గ్రామస్తులకు చిక్కి కటకటాలు లెక్కిస్తున్నారు. ఈ కేసులో గ్రామానికి చెందిన లిక్కి నర్సింహారెడ్డి ప్రధాన సూత్రదారిగా ఉన్నారు. నేడు నర్సింహారెడ్డి పరారీలో ఉన్నాడు. ఈ భవనంలో నిధి తీసి చాలా మంది లాభపడ్డారని గ్రామస్తులు తెలిపారు. పోలీసులు ఈ భవనంపై నిఘా వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


భవనంలో భూరికార్డులు

చుట్టూ ముళ్లకంచె వేయాలి



ఈభవనం చుట్టూ ముళ్లకంచె వేయాలని మేడిపల్లి సర్పంచ్ బాషకు సూచించాను. పట్టపగలు సంఘ వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా వేసి నిందితులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. తమ సిబ్బంది గ్రామం వెలితే ఈ భవనంపై నిఘా వేయమని చెబుతాను.

- చంద్రకుమార్, సీఐ యాచారం

పదేళ్లు పంచాయతీ భవనంగా..

మేడిపల్లి గ్రామానికి గ్రామ పంచాయతీ భవనం లేకపోవడంతో ఇదే భవనంలో కొంత కాలం గ్రామపంచాయతీ నడిపారు. నేడు కూడా మేడిపల్లి పంచాయతీకి సంబంధించిన భూ రికార్డులు ఆ భవనంలో ఉన్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వ అధికారులు ఎవరొచ్చినా నేరుగా ఇదే భవనంలోకి వెళ్లి జనాలను పిలిచి సమస్యలు తీర్చేవారు. గ్రామంలో జంట హత్యలు జరిగిన కాలంలో పోలీసులు ఇదే భవనంలో ఉండి శాంతిభద్రతలు పర్యవేక్షించారు.

బిల్లుల జాప్యం.. మరుగుదొడ్లకు శాపం

బిల్లులు సకాలంలో చెల్లించక మరుగు దొడ్ల నిర్మాణంలో ఆలస్యం

జిల్లాలో 1.64 వేల నిర్మాణాల టార్గెట్

పూర్తైనవి కేవలం 67వేలే..

30 గ్రామాల్లోనే 100 శాతం పూర్తి

అనంతగిరి : బిల్లుల చెల్లింపులు ఆలస్యం కావడంతో మరుగుదొడ్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. జిల్లాలో మొత్తం 1,64,861 కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాలలో మరుగుదొడ్లు స్వంతంగా నిర్మించుకున్నవి గతంలో ప్రభుత్వం వివిధ పథకాల కింద నిర్మించినవి మొత్తం 19708 ఉన్నాయి. ప్రభుత్వం స్వచ్ఛభారత్ అభియాన్ కింద జిల్లాలో ఇప్పటివరకు 67,885 మరుగుదొడ్లు నిర్మించారు. దీనిని బట్టి జిల్లాలో సగం శాతం మరుగుదొడ్లు కూడ పూర్తి కాలేదు. మరుగుదొడ్లు నిర్మాణంలో అధికారులపై ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఒత్తిడి తీసుకువస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు వంద శాతం మరుగుదొడ్లు నిర్మాణం పూర్తైన గ్రామాలు 30 మాత్రమే. గత సంవత్సరం స్వచ్ఛభారత్ అభియాన్‌లో 831 కాగా, ఈజీఎస్‌లో 3,275 పూర్తి చేశారు. అదే విధంగా ఎన్‌బీఏ కింద 10,394 నిర్మించారు. కాగా ఈ సంవత్సరం అన్ని గ్రామాల్లో స్వచ్ఛభారత్ అభియాన్ కింద మొత్తం గ్రామాలన్ని పూర్తి చేయడానికి టార్గెట్‌గా పెట్టుకున్నారు. దాదాపు అన్ని గ్రామాల్లో గుంతలు త్రవ్వి రింగులు వేసిన మరుగుదొడ్లు 50 శాతం ఉండగా అదే గ్రామాల్లో మరో 20 శాతం మరుగుదొడ్లు నిర్మించినా బిల్లులు రాకపోవడంతో సాటి లబ్ధిదారులు బిల్లులు వస్తాయో లేదోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్ మండల పరిధిలోని మదన్‌పల్లి గ్రామ పంచాయతీలో 150 మరుగుదొడ్లు మంజూరు కాగా సుమారు 20 శాతం మందికి పైగా మరుగుదొడ్లు పూర్తి చేశారు. పూర్తి చేసిన వారికి బిల్లులు రాక పోవడంతో బిల్లులు వస్తాయో లేదోనన్న అనుమానంతో సుమారు 100 మందిదాక గ్రామంలో గుంతలు త్రవ్వి సంగం బిల్లు కోసం వేచి చూస్తున్నారు. కాగా, గత మూడు నెలల క్రితం వరకు మరుగుదొడ్డి నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఇచ్చే రూ.12 వేలలో గుంత త్రవ్వి రింగులు వేయగానే రూ.6వేలు లబ్దిదారుని ఖాతాలో వేసేవారు. కాని గుంతలు త్రవ్వి రింగులు వేసినా ఇప్పటి వరకు డబ్బులు రాకపోవడం అదే విదంగా మరుగుదొడ్లు నిర్మాణం పూర్తి అయిన తరువాత కూడ బిల్లులు చెల్లించక పోవడంతో గ్రామాల్లో బిల్లుల విషయంలో అనుమానాలు రేకెత్తుతున్నాయి.

డబ్బు చెల్లించడం లేదు..



మరుగు దొడ్లు నిర్మించి రెండు నెలలు పూర్తైనా బిల్లులు చెల్లించడం లేదు. గ్రామంలో చాల మంది బిల్లులు చెల్లిస్తారో లేదో తెలియక గుంతలు త్రవ్వి వదిలేశారు. ఎక్కడ చూసినా గుంతలే కనిపిస్తున్నాయి. సుమారు వంతమందికి పైగా గుంతలు త్రవ్వి వదిలేశారు. బిల్లులు వచ్చే వరకు ఎవరూ నిర్మాణాలు ప్రారంభించేలాలేరు.

- సుల్తాన, మదన్‌పల్లి

ప్రతీ నెలా చెల్లిస్తున్నాం..



ప్రతీ నెలా లబ్దిదారులకు డబ్బులు చెల్లించడం జరుగుతుంది. వందశాతం మరుగుదొడ్లు పూర్తి చేసేందుకు కొన్ని గ్రామాలను ఎంచుకున్నాం. శనివారం వికారాబాద్ మండల పరిధిలోని కొటాల గూడ గ్రామాన్ని సందర్శించాం. ఇంటింటికి తిరిగి మరుగుదొడ్లను పరిశీలించాము. ఈ నెలాఖరులో ఇంకొన్ని గ్రామాలను 100 శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తైన గ్రామాలుగా ప్రకటించడం జరుగుతుంది.

- లక్ష్మి, స్వచ్ఛభారత్ జిల్లా కోఆర్డినేటర్


బిల్లులు చెల్లించక మధ్యలో ఆగిన నిర్మాణాన్ని చూపుతున్న లబ్ధిదారుడు

ప్రపంచంలో ఎత్తయిన జలపాతం?

భూమి - ఆవరణాలు

1. 1492లో భారతదేశానికి చేరాలని బయలు దేరిన కొలంబస్‌ది ఏ దేశం?
ఎ) స్పెయిన్ బి) పోర్చుగల్
సి) ఇంగ్లండ్ డి) ఇటలీ

2. ఐరోపా నుంచి పశ్చిమ దిశగా బయలుదేరిన కొలంబస్ ఏ దీవులకు చేరుకున్నాడు?
ఎ) ఇండోనేషియా బి) ఫిలిప్పీన్స్
సి) కరేబియన్ డి) జపాన్

3. భూమి ఎటువైపు భ్రమణం చేస్తుంది?
ఎ) పడమర నుంచి తూర్పునకు
బి) తూర్పు నుంచి పడమరకు
సి) ఉత్తరం నుంచి పశ్చిమానికి
డి) దక్షిణం నుంచి ఉత్తరానికి

4. ఉత్తర, దక్షిణ ధృవాల ద్వారా భూమి మధ్యగా గీసిన ఊహా రేఖను ఏమంటారు?
ఎ) కక్ష్య బి) అక్షం
సి) భూ నాభి డి) భూమధ్య రేఖ

5. 180^0 తూర్పు, పశ్చిమ రేఖాంశానికి మరోపేరు?
ఎ) గ్రీనిచ్ రేఖాంశం బి) 0^0 రేఖాంశం
సి) అంతర్జాతీయ దినరేఖ డి) భూమధ్య రేఖ

6. వీటిలో భూమిని సమాన అర్ధగోళాలు చేసేది?
ఎ) గ్రీనిచ్ రేఖ బి) భూమధ్య రేఖ
సి) అంతర్జాతీయ దిన రేఖ డి) 0^0 రేఖాంశం

7. 'లాటిట్యూడో' అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
ఎ) లాటిన్ బి) గ్రీక్
సి) రోమన్ డి) అరబిక్

8. లాటిట్యూడ్ అంటే అర్థం?
ఎ) పొడవు బి) నిలువు
సి) దూరం డి) వెడల్పు

9. Hemisphereలో Hemi అంటే అర్థం?
ఎ) అక్షాంశం బి) రేఖాంశం
సి) సగభాగం డి) పావు భాగం

10. అక్షాంశాల్లో పొడవు అనే పదానికి సమాన అర్థం ఇచ్చే పదం?
ఎ) లాటిట్యూడ్ బి) లాటిట్యూడో
సి) లాంగిట్యూడ్ డి) మెరిడియన్

11. వీటిలో రేఖాంశాలకు సంబంధించి సరికానిది?
ఎ) ఇవి పూర్తి వృత్తాలు కావు
బి) ప్రతి రేఖాంశం ప్రతి అక్షాంశాన్ని ఛేదిస్తుంది
సి) మొత్తం రేఖాంశాలు 180
డి) లండన్‌లోని గ్రీన్‌విచ్ రేఖాంశాన్ని 0^0 రేఖాంశం అంటారు

12. వీటిలో అక్షాంశాలకు సంబంధించి సరికానిది?
ఎ) ఇవి సమాంతర వృత్తాలు
బి) ధృవాల వైపునకు వెళ్తున్న కొద్దీ చిన్నవిగా అవుతాయి
సి) వీటి సంఖ్య 180
డి) భూమధ్య రేఖకు ఉత్తర ధృవానికి మధ్య భాగాన్ని దక్షిణార్ధగోళం అంటారు

13. యాంటి మెరిడియన్ అంటే?
ఎ) 180^0 రేఖాంశం బి) 90^0 అక్షాంశం
సి) 60^0 అక్షాంశం డి) 0^0 రేఖాంశం

14. భూమి ఒక డిగ్రీ మేర కదలడానికి ఎంత సమయం పడుతుంది?
ఎ) 15 ని. బి) 30ని. సి) 1ని. డి) 4ని

15. మధ్యాహ్న రేఖలు అని వేటిని అంటారు?
ఎ) అక్షాంశాలు బి) రేఖాంశాలు
సి) ఆయన రేఖలు డి) ధృవాలు

16. గ్రీనిచ్ కంటే భారత కాలమానం?
ఎ) 5.30 గం. ముందు బి) 5.30 గంట వెనక
సి) 3.30గం. ముందు డి) 3.30 గంట వెనక

17. సముద్ర ప్రవాహాలు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ప్రవహించడాన్ని ఏమంటారు?
ఎ) పోటు పాటులు బి) ప్రవాహాలు
సి) తరంగాలు డి) పైవేవీ కావు

18. సముద్ర ఉపరితల నీటి మట్టం హెచ్చు, తగ్గులను ఏమంటారు?
ఎ) పోటు పాటు బి) ప్రవాహాలు
సి) తరంగాలు డి) అలలు

19. సముద్రంలో నీటి మట్టం ప్రతి రోజూ పెరగడాన్ని, తగ్గడాన్ని ఏమంటారు?
ఎ) పోటు పాటు బి) ప్రవాహాలు
సి) తరంగాలు డి) అలలు

20. 'లితో' అంటే గ్రీక్ భాషలో అర్థం?
ఎ) బంతి బి) రాయి సి) నీరు డి) ఆవిరి

21. 'అట్మాస్ఫియర్'లో అట్మాస్ అనే గ్రీక్ పదానికి అర్థం?
ఎ) ప్రాణ వాయువు బి) నత్రజని
సి) జీవం డి) నీటి ఆవిరి


22. మధ్యధరా సముద్ర దీప స్తంభం అని ఏ అగ్ని పర్వతాన్ని అంటారు?
ఎ) మౌంట్ పీలే బి) ఫుజియమా
సి) స్ట్రాంబోలి డి) ఏదీ కాదు

23. 'కిలిమంజారో' అగ్ని పర్వతం ఏ దేశంలో ఉంది?
ఎ) జపాన్ బి) ఇటలీ
సి) ఈక్వెడార్ డి) టాంజానియా

24. వీటిలో భారతదేశంలోని అగ్ని పర్వతం?
ఎ) నార్కొండం బి) మౌంట్ వెసువియస్
సి) మాయన్ డి) కోటోపాక్సి

టిఆర్‌టి - 2017

సోషల్ స్టడీస్ కంటెంట్



25. సజీవంగా ఉన్న 3/4వ వంతు అగ్ని పర్వతాలు ఏ మహా సముద్ర అంచున ఉన్నాయి?
ఎ) హిందూ బి) అట్లాంటిక్
సి) ఆర్కిటిక్ డి) పసిఫిక్

26. ఉష్ణోగ్రతల్లో మార్పుల వల్ల శిలలు బలహీనమై, పగిలిపోయే ప్రక్రియను ఏమంటారు?
ఎ) క్రమక్షయం బి) రవాణా
సి) శిలాశైథిల్యం డి) నిక్షేపణ

27. గాలి, నీటి శక్తుల కారణంగా భూమి ఉపరితలంపై పొరలు కొట్టుకుపోవడాన్ని ఏమంటారు?
ఎ) క్రమక్షయం బి) రవాణా
సి) శిలా శైథిల్యం డి) నిక్షేపణ

28. కొలొరాడో నది ప్రత్యేకత?
ఎ) యూరప్‌లో అతి పెద్దనది
బి) అతిపెద్ద జలపాతాన్ని కలిగి ఉంది
సి) అతి పెద్ద అగాధ ధరిని కలిగి ఉంది
డి) ఏడారి ప్రాంతంలో ప్రవహించేది

29. గోదావరి నదిపై బైసన్ గార్జ్ ఎక్కడుంది?
ఎ) రాజమండ్రి బి) పాపికొండలు
సి) బాసర డి) కందకుర్తి

30. నదులు V ఆకారం లోయను ఎక్కడ ఏర్పాటు చేస్తాయి?
ఎ) పర్వత ప్రాంతాల్లో బి) మైదాన ప్రాంతాల్లో
సి) సముద్ర తీరాల్లో డి) పైవేవీ కావు

31. ప్రపంచంలో ఎత్తయిన జలపాతం?
ఎ) నయాగరా బి) ఎంజెల్
సి) టుగెలా డి) జోగ్

32. ఎంజెల్ జలపాతం ఏ నదిపై ఉంది?
ఎ) చురుణ్ బి) అమెజాన్
సి) ఓల్గా డి) నైలు

33. భారతదేశంలో ఎత్తయిన జోగ్ జలపాతం ఏ నదిపై ఉంది?
ఎ) మహానది బి) దామోదర్
సి) శబర్మతి డి) శరావతి

34. వీటిలో ప్రపంచంలో అతిపెద్ద డెల్టాను కలిగి ఉన్న నది?
ఎ) గంగా బి) సింధూ
సి) గోదావరి డి) కృష్ణా

35. U ఆకారపు లోయలను ఏర్పాటు చేసేవి?
ఎ) నదులు బి) సముద్రాలు
సి) గాలులు డి) హిమానీ నదాలు

36. ట్రోపో ఆవరణం సగటు ఎత్తు ఎన్ని కి.మీ.?
ఎ) 8 బి) 10 సి) 13) డి) 18

37. ట్రోపో ఆవరణం ఎత్తు ఎక్కువగా ఎక్కడ ఉంటుంది?
ఎ) భూమధ్య రేఖ బి) ధృవాలు
సి) ఆయన రేఖలు డి) పైవన్నీ

38. నీటి బిందువులు, బాష్పీభవనం, అవపాతం ఏ పొరలో కనిపిస్తాయి?
ఎ) ట్రోపో బి) స్ట్రాటో సి) థర్మో డి) మిసో

39. అన్నిటి కంటే పైన ఉండే ఆవరణం?
ఎ) స్ట్రాటో బి) మిసో సి) థర్మో డి) ఎక్సో

40. ఓజోన్ పొర ఏ ఆవరణంలో ఉంటుంది?
ఎ) ట్రోపో బి) స్ట్రాటో సి) థర్మో డి) మిసో

41. అయానో ఆవరణం అని దేనికి పేరు?
ఎ) మిసో బి) థర్మో సి) ఎక్సో డి) స్ట్రాటో

42. వీటిలో ఎత్తుకు వెళ్తున్న కొద్దీ ఉష్ణోగ్రత తగ్గే ఆవరణం?
ఎ) స్ట్రాటో బి) మిసో సి) థర్మో డి) ట్రోపో

43. 'సాధారణ క్షీణతక్రమం' అంటే?
ఎ) పైకి వెళ్తున్న కొద్దీ ఉష్ణోగ్రత తగ్గడం
బి) వాతావరణ పీడనం క్రమంగా క్షీణించడం
సి) గాలిలో నీటి ఆవిరి శాతం తగ్గడం
డి) ఉష్ణోగ్రలు వేగంగా తగ్గడం

44. వీటిలో సమశీతోష్ణ మండలాల్లో వీచే పవనాలు?
ఎ) వ్యాపార పవనలు బి) పశ్చిమ పవనాలు
సి) ధృవ పవనాలు డి) ఆగ్నేయ పవనాలు

45. 'మౌసమ్' అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
ఎ) హిందీ బి) గ్రీక్ సి) అరబిక్ డి) రోమన్

46. 'చినూడ్' అనే పదానికి అర్థం?
ఎ) భారీ వర్షం బి) మంచును తినేది
సి) మంచు తుపాను డి) వడగాలులు

47. ఆల్ప్సు పర్వతాల మీదుగా వీచే ఉష్ణ పవనం?
ఎ) చినూక్ బి) ఫోన్ సి) లూ డి) ప్యూనా

48. భారతదేశంలో మే-జూన్ నెలల్లో వీచే పవనాలు?
ఎ) పాంపెరో బి) ప్యూనా సి) చినూక్ డి) లూ

49. బాగా ఎత్తులో ఉన్న మేఘాలను ఏమని పిలుస్తారు?
ఎ) సిర్రస్ బి) క్యుములస్
సి) నింబస్ డి) స్ట్రాటస్

50. ఒరోజెనిక్ వర్షపాతం అని దేనిని అంటారు?
ఎ) సంవాహన వర్షపాతం బి) పర్వతీయ వర్షపాతం
సి) చక్రవాత వర్షపాతం డి) పైవేవీ కావు

51. సైక్లోన్ అనే ఇంగ్లీష్ పదానికి మూలమైన గ్రీక్ పదం 'కైక్లోస్' అంటే అర్థం?
ఎ) తుఫాను
బి) చక్రీయ వర్షపాతం
సి) తిరుగుతున్న
డి) భారీ వర్షం



నూతిపల్లి బాలరాజ్
స్కూల్ అసిస్టెంట్

52. వాతావరణంలో అదృశ్యంగా ఉన్న నీటి ఆవిరిని ఏమంటారు?
ఎ) ద్రవీభవనం
బి) భాష్పీభవనం
సి) ఆర్ద్రత
డి) అవపాతం

53. అవపాతం ఏ రూపంలో ఉంటుంది?
ఎ) వర్షం బి) మంచు
సి) తుషారం, వడగండ్లు డి) పైవన్నీ

54. గాలి వేగాన్ని కొలిచే పరికరం?
ఎ) హైగ్రో మీటర్ బి) అనిమో మీటర్
సి) స్పీడో మీటర్ డి) భారమితి

55. ఆక్స్‌భౌ సరస్సులు వేటి ద్వారా ఏర్పడతాయి?
ఎ) గాలి ప్రవాహాలు బి) క్రమక్షయం
సి) నదీ ప్రవాహాలు డి) సముద్ర ప్రవాహాలు

56. జెట్ విమానాలు ఎగరడానికి అనుకూలమైన పొర?
ఎ) ట్రోపో ఆవరణం బి) స్ట్రాటో ఆవరణం
సి) మిసో ఆవరణం డి) థర్మో ఆవరణం

57. పశువులకిచ్చే ఔషధాల్లో డైక్లోఫినాక్‌ను వాడటం వల్ల అంతరించే స్థితికి చేరిన జాతి?
ఎ) పిచుకలు బి) రాబందులు
సి) చిరుతలు డి) పైవన్నీ

58. క్యోటో ప్రోటోకాల్ తీర్మానం చేసిన సంవత్సరం?
ఎ) 1995 బి) 1997 సి) 2000 డి) 2002

59. క్యోటో ప్రోటోకాల్ ప్రకారం హరిత గృహ వాయువును ఎంత శాతం కంటే తక్కువ చేయాలని తీర్మానించారు?
ఎ) 2 బి) 3.7 సి) 5.2 డి) 6.4

60. ఏ గడ్డి భూములను యురేషియాలో 'స్టెప్పీలు' అంటారు?
ఎ) ఉష్ణమండల బి) సమశీతోష్ణ మండల
సి) టండ్రా డి) పైవేవీ కావు

Answers

1) డి	13) ఎ	25)డి	37) ఎ	49) ఎ
2) సి	14) డి	26)సి	38) ఎ	50) బి
3) ఎ	15) బి	27)ఎ	39) డి	51) సి
4) బి	16) ఎ	28)సి	40) బి	52) సి
5) సి	17) బి	29)బి	41) బి	53) డి
6) బి	18) సి	30)ఎ	42) డి	54) బి
7) ఎ	19) ఎ	31) బి	43) ఎ	55) సి
8) డి	20) బి	32) ఎ	44) బి	56) బి
9) సి	21) డి	33) డి	45) సి	57) బి
10)సి	22) సి	34) ఎ	46) బి	58) బి
11) సి	23) డి	35) డి	47) బి	59) సి
12) డి	24) ఎ	36) సి	48) డి	60) బి

స్కాలర్‌షిప్స్

న్యూఢిల్లీలోని సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్సెస్ & ట్రైనింగ్ స్కాలర్‌షిప్స్ కోసం దరఖాస్తులు కోరుతోంది.

